


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## గ్యాస్ మంట!

వినియోగదారులపై అదనపు భారం





ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 69 | సోమవారం 09 - 03 -2026 | పేజీలు : 12 | వెల-3


## ఆకాశంలో సగం కాదు... నింగీ నేలా మీరే

మహిళలకు నారా లోకేశ్ శుభాకాంక్షలు



మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నారా లోకేశ్

ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పిస్తే చంద్రబాబు పొదుపు సంఘాలు తెచ్చారని వెల్లడి

పిల్లల్లో నైతిక విలువలు పెంచేలా చాగంటి కోటేశ్వరరావు నియామకం

ఆడపిల్లలా ఏడవొద్దు.. గాజులు తొడుక్కోలేదు వంటి మాటలు మాట్లాడటం తప్పే

సినిమాల్లో మహిళలను కించపరిచేలా ఉంటే ఊరుకోనని హెచ్చరిక

2లో



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అమరావతిలో కార్యక్రమం

ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు

ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి

మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన

డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ

2లో

## మహిళాభివృద్ధి కోసం

# 'స్వయం' బ్రాండ్...

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని,

## నారీశక్తి వట్టిమాటే..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను మోసం చేశాయన్న షర్మిల

సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు నయవంచనకు పాల్పడ్డారని ఆరోపణ

మహాశక్తి, తల్లికి వందనం పథకాలతో లక్షల మందికి అన్యాయం జరిగిందని విమర్శ

దేశంలో మహిళలకు భద్రత కరువైందంటూ కేంద్ర ప్రభుత్వంపై ఫైర్

గ్యాస్, విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ధ్వజం

2లో

## 160 మంది బాలికల మృతికి ఇరాన్ ఆయుధాలే కారణం



ఇరాన్ పాఠశాలపై జరిగిన దాడిని ఖండించిన అమెరికా అధ్యక్షుడు

ప్రమాదానికి ఇరాన్ నాణ్యత లేని ఆయుధాలే కారణమని విశ్లేషణ

యుద్ధంలో సంపూర్ణ విజయం సాధిస్తున్నామని ట్రంప్ ప్రకటన

ఇరాన్ క్షిపణి వ్యవస్థ, నౌకాదళం ధ్వంసమైనట్లు వెల్లడి

చర్చలకు సిద్ధమే కానీ ఇరాన్ వైఖరి మారాలన్న అమెరికా ఎన్వాయ్

ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై జరిగిన ఘోర బాంబు దాడిలో 160 మంది మరణించిన ఘటనపై అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ దాడితో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. శనివారం ఆయన ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మయామికి వెళ్తున్న సమయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం, తాజా పరిణామాలపై ఆయన సుదీర్ఘంగా స్పందించారు. పాఠశాల దాడి గురించి విలేకరులు ప్రశ్నించగా ట్రంప్ ఆ ఆరోపణలను ఖండించారు. "నేను చూసిన సమాచారం, ఆధారాల ప్రకారం అది కచ్చితంగా ఇరాన్ చేసిన పనే. వారి ఆయుధాలు,

2లో

# రైతమ్మలకు జేజేలు

2లో



మహిళలను భూమాతతో పోల్చుతారు. అయితే భూమాత పచ్చగా మారి, ప్రపంచానికి ఆహారాన్ని అందిస్తోందంటే... ఆ కృషిలో మహిళా భాగస్వామ్యాన్ని మర్చిపోరాదు. అందుకే ఐక్యరాజ్య సమితి 2026ను 'మహిళా రైతుల సంవత్సరం'గా ప్రకటించింది. ఇది ప్రపంచ వ్యవసాయ చరిత్రలో ఒక కీలకమైన మలుపు. పొలాల్లో విత్తనాలు చల్లటం నుంచి, కుటుంబాన్ని నడిపించే దాకా... వ్యవసాయ రంగాన్ని నిశ్శబ్దంగా మోస్తున్న ఎందరో రైతమ్మల కృషికి లభించిన అంతర్జాతీయ గుర్తింపు ఇది. నేడు (మార్చి 8) 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా కొందరు మహిళా రైతుల విజయగాథలకు నీరాజనాలు పలుకుదాం...

### ఆదివాసీ వరికి రక్షణ

ఆంధ్రప్రదేశ్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు మండలం సొవ్వ, కరకవలస గ్రామాల్లో 45 మంది మహిళా రైతులు... 13 పురాతన దేశీయ వరి రకాలను సాగు చేయడంతో పాటు, కరకవలస గ్రామంలో గెడ్డ వాగు వరదలకు మునిగిపోకుండా తట్టుకునే 4 నుంచి 6 అడుగుల వరకు పెరిగే దేశీయ వరిని సాగు చేస్తున్నారు. ఇక్కడి కుటుంబాలకు ఎకరం నుంచి రెండు ఎకరాలకు మించి ఉండదు. "ఇవి దేవుడు ఇచ్చిన ధాన్యపు రకాలు అని మా నమ్మకం. బస్నా సోఫ్పూర్, బుడమ ధాన్యం, దేశీ పెద్దధాన్యం, దేశీ రాజముడి, ఎర్ర ధాన్యం, గుడుం ధాన్యం, ఇసుకరవ్వలు, జోజోర్కి ధాన్యం, మాస్టర్ ధాన్యం, నల్ల ధాన్యం, పసుపు సన్నాలు, సోర్ ధాన్యం, తేటం ధాన్యం ఇలా 13 రకాలు పండిస్తున్నాం. ఇవన్నీ మా పూర్వీకులు ఎప్పుడో పండించినవే, మేము వాటిని కాపాడుకుంటున్నాం' అంటున్నారు లకోయి సుమతి. ఈ దేశీయ వరి రకాలను శుద్ధి చేసి (వేరే రకాలు కలవకుండా), వాటి ఉత్పత్తిని పెంచడానికి కరకవలస గ్రామంలో బయోడైవర్సిటీ బ్లాక్‌లను గ్రామస్తులంతా ఏర్పాటు చేసుకున్నారు. ఈ పురాతన వరి వంగడాల విలువను గుర్తించిన వాసన్, వికాస స్వచ్ఛంద సంస్థలు ఈ మహిళా రైతుల నుంచి ప్రతీ రకానికి 500 కిలోల చొప్పున సకరించి విత్తనాల అభివృద్ధికి, ఇతర ప్రాంతాలకు

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన నన్ను కలచివేసింది



డార్జిలింగ్ సంతాల్ సదస్సు నిర్వహణ తీరుపై పవన్ కల్యాణ్ స్పందన

రాష్ట్రపతి ఆవేదన భరిత వ్యాఖ్యలు తనను బాధించాయన్న డిప్యూటీ సీఎం

సొంత సదస్సుకే సంతాల్ ప్రజలు రాలేకపోవడం దురదృష్టకరం

రాష్ట్రపతి పర్యటనను హుందాగా నిర్వహించడంలో అధికార యంత్రాంగం విఫలం

2లో

## మాట మార్చిన ఇరాన్ అధ్యక్షుడు...



ఎవరైనా దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని మసూద్ హెచ్చరిక

కువైట్, బహ్రెయిన్, దుబాయ్‌లలో కొనసాగుతున్న దాడుల పరంపర

బేషరతు లొంగుబాటు కోరిన ట్రంప్..

2లో

# త్వరలోనే తెలంగాణలో ఉచిత స్కూటీలు

విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ

2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులు

నగరంలోని డీజిల్ బస్సులు జిల్లాలకు తరలింపు

ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్ విధానం

ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

2లో




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థినులకు తీపి కబురు అందించారు. చదువుకునే ఆడబిడ్డల ప్రయాణ కష్టాలను తీర్చడంతో పాటు, వారిని



## విశ్వవిజేతగా భారత్

2లో

టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా అద్భుతం చేసింది. వరుసగా రెండో సారి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. ముచ్చటగా మూడు సార్లు పొట్టి ఫార్మాట్లో విశ్వవిజేతగా నిలిచిన ఏకైక జట్టుగా చరిత్ర సృష్టించింది. అచ్చిరాదన్న అహ్మదాబాద్ స్టేడియంలో సూర్యసేన.. కివీస్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. నరేంద్ర మోదీ స్టేడియంలో టీమిండియా బ్యాటర్లు, బౌలర్లు, ఫీల్డర్లు చెలరేగిన వేళ.. కివీస్ చిత్తు అయింది. 256 పరుగుల ఛేదనకు దిగిన న్యూజిలాండ్.. 159కే ఆలౌటైంది.టీమిండియా నిర్దేశించిన 256 పరుగుల ఛేదనలో కివీస్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. టిమ్ సీఫర్ట్(52), కెప్టెన్ శాంట్నర్(43) మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయారు. టీమిండియా బౌలర్ల ధాటికి వరుసగా పెవిలియన్ బాట పట్టారు. బుమ్రా 4, అక్షర్ పటేల్ 3, హార్దిక్ పాండ్య, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలోక వికెట్ పడగొట్టారు.



# రైతమ్మలకు జేజేలు

ఈ బియ్యాన్ని మార్కెటింగ్ చేసి ఆదివాసీల ఆదాయం పెంచడానికి కృషి చేస్తున్నాయి. స్థానిక వరి రకాలకు అధిక డిమాండ్ ఉంది. పర్యాటకులు అరకు లోయలోని దుకాణాల నుంచి కిలోకు రూ.80 చొప్పున చెల్లించి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

**కాయగూరలు, పండ్లకు కొత్త జీవం** తూర్పు కనుమల ప్రాంతం. పనస, పైనాపిల్, మామిడి వంటి పండ్లకు పెట్టింది పేరు. కానీ మార్కెట్ లేని రోజుల్లో అదే పంట రోడ్ల పక్కన పారేస్తున్న దృశ్యాలు రమణమ్మ మనసును కలిచివేశాయి. ఆమె ఒక వ్యవసాయ కూలీ. అనకాపల్లి జిల్లాలోని చోడవరానికి చెందిన ఆమె, బాల్యం నుంచే పేదరికంతో పోరాడుతూ వ్యవసాయ పనులు చేస్తూనే డిగ్రీ పూర్తి చేసింది. తమ ప్రాంతంలోని గిరిజన రైతులు నష్టపోతున్న తీరును చూసి ఊరుకోలేక, మాడుగుల సమీపంలోని 'వికాసవనం'లో చేరింది. అక్కడ కొన్ని సంస్థల సహకారంతో ఎకరం విస్తీర్ణంలో సోలార్ డ్రైయర్లు ఏర్పాటు చేసి కాయగూరలు, పండ్లకు కొత్త జీవం పోసింది. కొండ ప్రాంతాల్లో పండే పైనాపిల్, మామిడి, పనస, అరటి, సపోట వంటి సీజనల్ ఫ్రూట్స్‌ను ముక్కలుగా చేసి, డ్రై చేసి అన్‌సీజన్‌లోనూ అందుబాటులో ఉంచుతూ ఎగుమతులు మొదలుపెట్టింది. అల్లం, మునగాకు, కరివేపాకు, ఉసిరి పొడులు కూడా ఇక్కడే తయారవు తున్నాయి. "అల్లం పొడి కూరల్లో, టీలో వేస్తారు. మ్యాంగో పొడి పులిహోర, కూరల్లో ఎక్కువగా అడుగుతున్నారు. ఉసిరి పొడికీ మంచి డిమాండ్ ఉంది. పనస, అరటి డ్రైడ్ ఫ్రూట్స్‌ను ఐస్‌క్రీమ్ కంపెనీలు కోరుతున్నాయి," అని రమణమ్మ చెబుతుంది. ఈ కృషిని గుర్తించిన హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ పండ్లు నిల్వ ఉండేందుకు కోల్డ్ స్టోరేజీ రూమ్ ఏర్పాటు చేసింది. ఫలితంగా రమణమ్మతో పాటు నలుగురు మహిళలకు ఉపాధి, రైతులకు నష్టాల తగ్గింపు, అన్‌సీజన్‌లోనూ పండ్ల లభ్యత. అధిక దిగుబడి వచ్చినప్పుడు పంటను విలువ ఆధారిత ఉత్పత్తిగా మార్చి లాభాలు పొందే మార్గం చూపింది. తూర్పు కనుమల్లో రమణమ్మ వెలిగించిన ఈ చిన్న దీపమే, పెద్ద మార్పునకు వెలుగుబాటగా మారింది.

**టమాటా నష్టాలకు చెక్... భారతమ్మ ఐడియా!** టమాటా.... ఒక సీజన్‌లో కిలోకి వంద రూపాయలుంటుంది... ఇంకో సీజన్ లో కిలోకి రూపాయి కూడా ధర పలకదు! ప్రతీ సీజన్ లోనూ పత్రికల్లో దీని ధర ఒక తప్పనిసరి వార్త! ఇలాంటి వార్తలను బ్రేక్ చేసిన రైతు భారతమ్మ. రాయలసీమ ప్రాంతంలో రైతులకు టమాటా సాగు ప్రతి ఏటా ఒక ప్రశ్నగానే ఉంటుంది. మార్కెట్ ధరలలో తీవ్రమైన తేడాలే దానికి కారణం. ఇలాంటి పరిస్థితిలో అనంతపురం జిల్లా, బంద్రేపల్లి గ్రామానికి చెందిన భారతమ్మ ఒక పరిష్కారం చూపారు. కేవలం టమాటా మాత్రమే కాకుండా, దాంతో పాటు మరికొన్ని అంతర పంటలను కలిపి సాగు చేస 'పాలీ క్రాపింగ్' మోడల్స్‌ని ఆమె అమలు చేశారు.

"టమాటాతో పాటు కూరగాయలు, ఆకుకూరలను మిశ్రమ పద్ధతిలో అంతర పంటలుగా వేయడం, ఏడాది పొడవునా పెరిగే కొన్ని తీగ జాతి పంటలు కలిపి వేయడం, ఇలా రకరకాల ప్రయోగాలు చేశాను. మార్కెట్ ధరల వల్ల కలిగే రిస్కు తగ్గించడం, అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం అందేలా చూడటం... ఈ మోడల్స్ ఉద్దేశం. గత మూడేళ్లుగా ఈ విధానం పాటిస్తున్నాను. టమాటా వల్ల ఇప్పటి వరకు నష్టపోలేదు' అంటోంది భారతమ్మ. ఆమె సహజ వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారు, ఆమెను ఆదర్శంగా తీసుకొని 8 మంది రైతులతో మొదలైన ఈ పాలీక్రాప్ విధానం ఇవ్వాళ 250 మంది రైతులకు చేరింది. శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలలో దాదాపు 96.50 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం ప్రధాన పంట టమాటాను మరికొన్ని అంతర పంటలతో కలిపి సాగు చేస్తున్నారు.

**మంచు బిందువులతో 25 రకాల పంటలు** 'నాకు ముగ్గురు బిడ్డలు. డెలివరీకి ఏ ఆసుపత్రికీ వెళ్లలేదు. ఇంట్లోనే నార్మల్ డెలివరీ అయింది. ఇప్పటిదాకా మా కుటుంబానికి డాక్టర్ ఎలా ఉంటారో తెలీదు. ఒక్క టాబ్లెట్ కూడా వేసుకోలేదు. మేమే కాదు మా ఊరంతా అంతే ఆరోగ్యంగా ఉంటారు. ఇదంతా మా ప్రకృతి పంటల మహిమ" అన్నారు వినోద. ఆమెకు నాగ్వర్ గ్రామంలో (న్యాల్‌కల్ మండలం, సంగారెడ్డి జిల్లా) రెండు ఎకరాలుంది. దానిలో 25 రకాల చిరుధాన్యాలు పండిస్తున్నారు. "మాకు నీటి వసతి లేదు. వర్షాధార సాగు. మా అత్తమ్మల ద్వారా చిరుధాన్యాల పంటల సాగు నేర్చుకున్నాం. మంచు కురిసే సీజన్‌లో కొన్ని పంటలు ఆ తేమకే పండుతాయి. జొన్నల్లో 4 రకాలు, రాగులు, సజ్జలు, కొర్రల్లో అయిదేసి రకాలు... ఇలా ఏడాదంతా ఏదో ఒక పంట పండిస్తాం. నెలకో పంట దిగుబడి వస్తుంది. ముందు కుటుంబ అవసరాలకు ఉంచుకున్న తరువాత మిగిలిన పంటనే అమ్ముకుంటాం" అంటారామె. విత్తనాలు, ఎరువులు సొంతంగా తయారు చేసుకుంటారు తప్ప బయట నుంచి ఒక్కటి కూడా కొనరు. ఈ ఊరిలో ఎరువుల షాపులుండవు. అన్ని ఖర్చులు పోనూ ఎకరానికి లక్షన్నరకు పైగా లాభం వస్తుందన్నారు వినోద.

**చిరుధాన్యాలతో సిరులు** .యిజూస్త్రవాతావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో చాలా తక్కువ నీటితో పండే చిరుధాన్యాల సాగును విస్తృతంగా చేపట్టడం మేలని వ్యవసాయ శాస్త్రవేత్తలంటారు. వీటికి కరువు ప్రాంతాలే అనుకూలం. అయితే మిల్లెట్స్ సాగులో రైతులు ముందుకు వచ్చినప్పటికీ, వాటి ప్రాసెసింగ్‌లో ఉన్న క్లిష్టత, వాటి వినియోగం తగ్గడానికి రైతులు నష్టపోవడానికి కారణం అయ్యింది. ఈ సమస్యకు కొత్త పరిష్కారం చూపారు కొందరు మహిళలు. చిరుధాన్యాల పోషక విలువలు కోల్పోకుండా వాటి పొట్టుతీయడానికి అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేసి, మిల్లెట్స్‌ని పునర్వినియోగంలోకి తేవడానికి కృషి చేస్తున్నారు. ఇప్పుడు అన్ని రకాల మిల్లెట్స్‌ని ఆధునిక యంత్రాలపై ప్రాసెస్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా మామిడిపాలెంలో ఏర్పాటయ్యింది 'మన్యం గ్రెయిన్స్'. ఊరి మధ్యనే 'మన్యం గ్రెయిన్స్' ఫ్యాక్టరీ పెట్టి, చిరుధాన్యాలతో సేమియా, ఇడ్లీ, దోసె పిండి తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా ఫ్యాక్టరీ సమీపంలో ఒక మిల్లెట్ రెస్టారెంట్ ఏర్పాటు చేసి, సజ్జల జంతికలు, జొన్నల స్నాక్స్, అరికల అప్పడాలు తయారు చేస్తున్నారు. 'మన్యం గ్రెయిన్స్' మహిళల కృషి వల్ల ఏజెన్సీ రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించింది. మామిడిపాలెం చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా చిరుధాన్యాలు పండించుకొని ఇక్కడే ప్రాసెస్ చేయించుకొని లాభాలు పొందుతున్నారు. ఈ మిల్లెట్స్ మిల్, రెస్టారెంట్ వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా రెండొందలకు పైగా మహిళలకు ఉపాధి దొరికింది. వర్షాధార భూముల్లో అరుదైన సంపదను సృష్టించి, గ్రామీణ ఎకానమీని మార్చారు.

**పశుగ్రాస ప్రయోగంతో పాల వెల్లువ** .యిజూస్త్రఅక్కడ మేత లేక పశువులు విలవిల్లాడేవి. సుదూర ప్రాంతాలైన శ్రీకాళహస్తి, రాయచోటి నుంచి పశుగ్రాసం తెప్పించుకోవాల్సి వచ్చేది. ఆర్థిక భారం తట్టుకోలేని రైతులు పశువులను చౌకగా అమ్మేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలాంటి స్థితిలో ఒక మహిళా రైతు పంటపొలాల్లో చేసిన చిన్న ప్రయోగం వీరిని సమస్యల నుంచి బయటపడేలా చేసి... పాల ఉత్పత్తిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో అయ్యవారిపల్లికి చెందిన హేమలత పశుగ్రాసం కష్టాల నుంచి పాడి రైతులను గట్టెక్కించడానికి, భిన్నమైన సేద్యం చేస్తున్నారు. తనకున్న రెండు ఎకరాల్లో ఒక ఎకరంలో కూరగాయలు వేసి మరో ఎకరంలో పశుగ్రాసం పెంచుతున్నారు. అయితే ఒకేరకం పశుగ్రాసం కాకుండా మల్టీ స్పీషీస్ ఫోడర్ ని పెంచడం మొదలు పెట్టారు.

# మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్...

డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు."మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు. ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే అని గుర్తుచేశారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని, ఆ నిర్ణయం వల్లే నేడు ఐటీ వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వివరించారు. భవిష్యత్తులో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి రావడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళల భద్రత విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది. అలాంటి దుర్మార్గులను కఠినంగా హెచ్చరిస్తున్నా. మీ భద్రతకు చంద్రన్న ఉన్నంతవరకు భయపడాల్సిన అవసరం లేదు," అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఒక మహిళే (అనిత) ఉన్నారని, ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే స్పందిస్తారని గుర్తుచేశారు. ఇదే సమయంలో, రాష్ట్రంలో జనాభా తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఒకప్పుడు 'ఒక బిడ్డ ముద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు వద్దు' అన్నాను. కానీ ఇప్పుడు 'ఒక బిడ్డ వద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు ముద్దు' అని చెబుతున్నాను. రాష్ట్రంలో జననాల రేటు 1.5కి పడిపోయింది. ఇది ప్రమాదకరం. అందుకే పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేందుకు అవసరమైతే మూడు పడకగదుల ఇల్లు, అదనపు రేషన్ వంటి ప్రోత్సాహకాలు అందిస్తాం" అని నూతన విధానాన్ని ప్రకటించారు.

# నారీశక్తి వట్టిమాటే...

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆమె ఆరోపించారు. ఆకర్షణీయమైన పథకాలతో మహిళలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో మహిళలకు ఇచ్చిన మూడు హామీలను విస్మరించి నయవంచనకు పాల్పడిందని షర్మిల విమర్శించారు. 'మహాశక్తి' పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పి 1.80 లక్షల మందిని, 'తల్లికి వందనం' కింద 20 లక్షల మంది తల్లులను మోసం చేశారని ఆరోపించారు. వడ్డీ లేని రుణాల హామీతో 1.18 లక్షల డ్వాక్రా మహిళలను వంచించారని అన్నారు. ఇంటికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చారని, ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచి వంటింటిపై భారం మోపారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై కూడా షర్మిల విమర్శలు చేశారు. దేశంలో గంటకు 50 మంది మహిళలపై దాడులు జరుగుతుంటే 'నారీశక్తి వందన్' ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను విస్మరించి, వారిని అర్ధరాత్రి అరెస్టు చేయించి అవమానించారని దుయ్యబట్టారు. రెండేళ్ల పాలనలో కుటుంబాలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వం, మహిళలను ఉద్ధరించామని చెప్పుకోవడానికి సిగ్గుపడాలని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు గ్యాస్ ధరల భారాన్ని ప్రభుత్వమే మోసేదని ఆమె గుర్తుచేశారు.

# ఆకాశంలో సగం కాదు... నింగీ నేలా మీరే:

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సోషల్ మీడియా వేదికగా మహిళల త్యాగాలను, శక్తిని కొనియాడుతూ ఓ ఆసక్తికరమైన సందేశాన్ని విడుదల చేశారు. "అమ్మా.. నీవు ఆకాశంలో సగం కాదమ్మా.. నింగీ నేలా నీవే. ఈ సృష్టి మీది.. మా జన్మ మీది" అంటూ మహిళల ప్రాధాన్యతను లోకేశ్ గొప్పగా వర్ణించారు. అమ్మ, భార్య, సోదరి, కుమార్తె, పిన్ని, మరదలు ఇలా ప్రతి రూపంలోనూ మనల్ని కంటికి రెప్పలా కాపాడే మాతృమూర్తులందరికీ వందనాలు సమర్పించారు. ఈ సందర్భంగా తన కుటుంబం, పార్టీ మహిళల కోసం చేసిన కృషిని లోకేశ్ గుర్తుచేశారు. మహిళలను గౌరవించాలనే నైతిక విలువలను తన తల్లి చిన్నప్పుడే నేర్పించారని, దివంగత ఎన్టీఆర్ ఆడపడుచులకు ఆస్తిహక్కు కల్పిస్తే.. తన తండ్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలతో మహిళా సాధికారతకు బాటలు వేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి', 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా మహిళలకు అండగా నిలుస్తోందని, ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. భావితరాల్లో మహిళల పట్ల గౌరవం పెంచేందుకు విద్యావ్యవస్థలో కీలక మార్పులు చేశామని లోకేశ్ వెల్లడించారు. నైతిక విలువల సలహాదారుగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావును నియమించి, వారి సూచనలతో పాఠ్యాంశాల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. పాఠ్యపుస్తకాల్లో స్త్రీ, పురుషులను సమానంగా చూపే చిత్రాలనే ముద్రించామన్నారు. సమాజంలో తరచూ వినిపించే "ఆడపిల్లలా ఏడవొద్దు", "గాజులు తొడుక్కోలేదు", "చీర గాజులు పంపిస్తా" వంటి మాటలు ఎవరు మాట్లాడినా తప్పేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మహిళలను కించపరిచే భాష, సన్నివేశాలు ఉండకూడదని తాను పోరాడుతున్నట్లు చెప్పారు. అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళామూర్తుల సహనానికి, శక్తికి లోకేశ్ పాదాభివందనం చేశారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన నన్ను కలచివేసింది

పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో జరిగిన 'అంతర్జాతీయ సంతాల్ సదస్సు' నిర్వహణ తీరు, అక్కడ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎదురైన పరిణామాలపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ద్రౌపది ముర్ము, అక్కడి పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని, అవి తనను తీవ్ర ఆందోళనకు గురిచేశాయని పవన్ పేర్కొన్నారు. సంతాల్ సామాజిక వర్గం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఒక సదస్సును నిర్వహించినప్పుడు, అందులో ఆ వర్గానికి దక్కాల్సిన గౌరవం, ప్రాధాన్యత కచ్చితంగా ఉండాలని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఎవరి కోసమైతే ఈ సదస్సును ప్రత్యేకంగా ఏర్పాటు చేశారో, ఆ సంతాల్ కమ్యూనిటీకి చెందిన సభ్యులే ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తడం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. ఇలాంటి సాంస్కృతిక సమావేశాలు అందరినీ కలుపుకుపోయేలా, సున్నితత్వంతో కూడిన పరిపాలనా ప్రణాళికతో జరగాలని హితవు పలికారు. ముఖ్యంగా భారత రాష్ట్రపతి పదవి అనేది దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ పదవి అని, ఆ పదవికి, ఆ వ్యవస్థకు ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం దక్కాలని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. రాష్ట్రపతి పర్యటన అంటే ఎంతో హుందాగా, పకడ్బందీగా జరగాలని, అది ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం బాధ్యత అని స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటనలో ప్రొటోకాల్, మర్యాదలకు భంగం వాటిల్లడం సరికాదన్నారు. భారతదేశ అస్తిత్వంలో, మన దేశ ఖ్యాతిలో గిరిజన సమాజాలు అంతర్భాగమని పవన్ కల్యాణ్ కొనియాడారు. వారి సంస్కృతి, సంప్రదాయాలు, వారి గళానికి ఎల్లప్పుడూ నిజాయతీతో కూడిన గౌరవం లభించాలన్నారు. గిరిజనుల మనోభావాలను దెబ్బతీసేలా, రాజ్యాంగ అధిపతికి అసౌకర్యం కలిగించేలా జరిగిన ఈ సంఘటన దురదృష్టకరమని పవన్ కల్యాణ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా పాలకులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## విశ్వవిజేతగా భారత్

**టీమిండియా బ్యాటర్ల విధ్వంసం** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. కివీస్ బౌలర్లకు చల్లటి సాయంత్రం వేళ ముచ్చెమటలు పట్టించారు. అభిషేక్ శర్మ(52), సంజు శాంసన్(89), ఇషాన్ కిషన్(54) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ఆఖరిలో వచ్చిన దూబే(26బి) మెరిపించాడు. బ్యాటర్ల విధ్వంసానికి టీమిండియా 5 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో నీషమ్ 3, రచిన్ రవీంద్ర, హెన్రీ తలొక వికెట్ పడగొట్టారు.

# మాట మార్చిన ఇరాన్ అధ్యక్షుడు...

ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ఊహించని మలుపులు తిరుగుతోంది. నిన్నటి వరకు పొరుగు దేశాలకు క్షమాపణలు చెప్పి, శాంతి వచనాలు పలికిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఒక్కరోజులోనే తన వైఖరిని పూర్తిగా మార్చుకున్నారు. "శత్రువులు నా మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారు. మాపై ఎవరైనా దాడి చేస్తే చూస్తూ ఊరుకోం. ఎంత ఒత్తిడి పెంచితే మా స్పందన అంత బలంగా ఉంటుంది. ఇరాన్ బెదిరింపులకు, దాడులకు ఎప్పుడూ తలొగ్గలేదు, భవిష్యత్తులోనూ తలొగ్గదు" అని ఆయన వీడియో సందేశంలో తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. వాస్తవానికి ఇరాన్ తాత్కాలిక నాయకత్వ మండలి (ఇంటరిమ్ లీడర్‌షిప్ కౌన్సిల్) పొరుగు దేశాలపై దాడులు నిలిపివేస్తామని, కేవలం ఆత్మరక్షణ కోసమే స్పందిస్తామని తొలుత హామీ ఇచ్చింది. కానీ, ఆ హామీ కొన్ని గంటలు కూడా నిలవలేదు. దీనికి తోడు ఇరాన్ జ్యుడీషియరీ చీఫ్, ఇంటరిమ్ కౌన్సిల్ సభ్యుడు ఘోలామ్‌హొస్సేన్ మోహ్‌సెని ఈజేఈ మరింత ఘాటుగా స్పందించారు. "పొరుగు దేశాల్లో శత్రువుల స్థావరాలు ఉన్నాయని మాకు ఆధారాలు ఉన్నాయి. ఆయా లక్ష్యాలపై మా దాడులు కొనసాగుతాయి" అని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు అట్టుడుకుతున్నాయి. ఇరాన్ తన పొరుగు దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణి, డ్రోన్ దాడులను ఉధృతం చేసింది. కువైట్ విమానాశ్రయంలోని ఇంధన ట్యాంకులు, బహ్రెయిన్‌లోని డీసాలినేషన్ ప్లాంట్లు దాడుల్లో దెబ్బతిన్నాయి. దుబాయ్ మెరీనా ప్రాంతంలో ఇంటర్‌సెప్ట్ చేయబడిన ఒక క్షిపణి శకలాలు పడి, ఒక భారీ నివాస భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. అటు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్రయం సమీపంలోనూ భారీ పేలుడు సంభవించి, ఆకాశం నల్లటి పొగతో కప్పబడిపోయింది. బాగ్దాద్ సహా ఇజ్రాయెల్, ఖతార్, యూఏఈలలో ఎయిర్ రైడ్ సైరన్లు మోగుతుండటంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలని డిమాండ్ చేశారు. "మేము ఇరాన్‌ను చాలా గట్టిగా కొట్టబోతున్నాం" అని హెచ్చరించారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలను పెజెష్కియన్ తీవ్రంగా ఖండించారు. లొంగుబాటు అనేది వారి పగటి కల మాత్రమేనని, ఆ కలలను వారు సమాధి చేసుకోవాల్సిందేనని కొట్టిపారేశారు. దీనికి ట్రంప్ దీటుగా బదులిస్తూ.. "ఒక దశ దాటితే, 'మేం లొంగిపోతాం' అని చెప్పడానికి కూడా అక్కడ ఎవరూ మిగలరు" హెచ్చరించారు. క్షమాపణలు చెప్పిన గంటల్లోనే ఇరాన్ మళ్ళీ యుద్ధం సైరన్ మోగించడంతో మధ్యప్రాచ్యంలో శాంతి ఆశలు ఆవిరయ్యాయి.

## జనసేన పార్టీ 5 లక్షల ప్రమాద బీమా మీ కుటుంబానికి భరోసా:

### జిల్లా జనసేన పార్టీ పరిశీలకులు కిలారి వెంకట రోశయ్య

**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 8 నంది పత్రిక** ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి సోదరులు ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రోజున స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నందు ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ముఖ్య అతిథిగా హాజరై, సభ్యత్వ నమోదు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత పెద్ద కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన ఇరిగెల సోదరులకు కృతజ్ఞతలు. స్థానిక ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గెలుపులో ఇరిగెల సోదరుల పాత్ర ఎంతో కీలకం. మీ నిరంతర కృషి, క్షేత్రస్థాయి పోరాటం వల్లే ఎమ్మెల్యే విజయం సాధ్యమైందని ప్రస్తుతం సభ్యత్వ నమోదు ప్రక్రియ కొంత మందకొడిగా సాగుతోంది. అయితే, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ మరింత ఉత్సాహంగా పనిచేయాలి. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు జనసైనికులు నడుం బిగించాలని భవిష్యత్తులో సభ్యత్వ నమోదు వేగాన్ని పెంచి లక్ష్యాలను చేరుకోవాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఇరిగెల రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ.కిలారి రోశయ్య సూచనలను శిరసావహిస్తామని ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి జనసేన సిద్ధాంతాలను తీసుకెళ్తామని, రాబోయే రోజుల్లో సభ్యత్వ నమోదును ఒక ఉద్యమంలా చేపట్టి విజయవంతం చేస్తామని గడువు తక్కువ ఉంది గనుక మరికొన్ని రోజులు సభ్యత్వ నమోదుకు అవకాశం ఇవ్వాలని సభాముఖంగా కిలారి రోశయ్యను ఇరిగెల కోరారు తమపై నమ్మకం ఉంచిన జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగెల సోదరులతో పాటు పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.





# 160 మంది బాలికల మృతికి ఇరాన్ ఆయుధాలే కారణం

మందుగుండు సామాగ్రి చాలా అస్థిరంగా ఉంటాయి. వాటికి లక్ష్యాన్ని ఛేదించే కచ్చితత్వం అస్సలు ఉండదు. గురి తప్పి వారి పాఠశాల మీదే పడి ఉండవచ్చు తప్ప, మేము స్కూల్ పిల్లలపై దాడులు చేయం. ఇది పూర్తిగా వారి తప్పిదమే," అని ట్రంప్ స్పష్టం చేశారు. యుద్ధం పురోగతిపై ట్రంప్ పూర్తి ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తాము యుద్ధంలో గొప్ప విజయాలు సాధిస్తున్నామని, ఇరాన్ అనే "దుష్ట సామ్రాజ్యాన్ని" దాదాపు నేలమట్టం చేశామని వ్యాఖ్యానించారు. "వారి నౌకాదళంలోని 44 ఓడలను, వైమానిక దళంలోని ప్రతి విమానాన్ని మేము ధ్వంసం చేశాం. వారి క్షిపణి తయారీ కేంద్రాలపై, డ్రోన్ల నిల్వలపై తీవ్ర దాడులు జరిపాం. ఫలితంగా ఇప్పుడు ఇరాన్ నుంచి వచ్చే దాడులు నామమాత్రంగా మారాయి. యుద్ధం మొదలైన మొదటి రెండు రోజులతో పోలిస్తే, ప్రస్తుతం వారు కేవలం 9 శాతం సామర్థ్యంతోనే పోరాడుతున్నారు. వారి దగ్గరున్న 70 శాతం లాంచర్లు నాశనమయ్యాయి. అవి చాలా ఖరీదైనవి, తిరిగి సమకూర్చుకోవడం వారికి చాలా కష్టం. వారి నాయకత్వం అంతా దాదాపు అంతమైంది," అని అమెరికా విజయాలను ట్రంప్ వివరించారు. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందన్న ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ, తాను కాలపరిమితిని అంచనా వేయనని, ఎంత సమయం పడితే అంత కాలం పోరాడుతామని చెప్పారు. ఇరాన్ సైన్యం దాదాపు తుడిచిపెట్టుకుపోయిందని, వారిపై మరింత తీవ్రంగా విరుచుకుపడాలా వద్దా అనేది ఇంకా నిర్ణయించలేదని అన్నారు.ఈ పర్యటనలో ట్రంప్ వెంట అమెరికా ప్రత్యేక ఎన్వాయ్ స్టీవ్ విట్‌కాఫ్ కూడా ఉన్నారు. ఆయన మాట్లాడుతూ, దౌత్యపరమైన పరిష్కారం సాధ్యమేనని, అయితే అది పూర్తిగా ఇరాన్ చేతుల్లోనే ఉందన్నారు. "గత చర్చల్లో వారు సహకరించలేదు. తమకు యురేనియం శుద్ధి చేసే హక్కు ఉందని, 11 అణుబాంబులకు సరిపడా ఇంధనం తమ వద్ద ఉందని గొప్పలు చెప్పారు. యుద్ధంలో గెలవలేని దాన్ని, చర్చల ద్వారా సాధించలేమని వారికి స్పష్టం చేశాం. కాబట్టి వారి అహంకారం, ధోరణి మారాలి," అని విట్‌కాఫ్ అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, జోర్డాన్ వంటి దేశాలపై క్షిపణి దాడులు చేసింది. అయితే, ఇరాన్ సైనిక పాటవం ఇప్పుడు పూర్తిగా దెబ్బతిన్నదని, ప్రపంచం నుంచి ఒక పెద్ద "క్యాన్సర్"ను తొలగిస్తున్నామని ట్రంప్ అభివర్ణించారు.

## త్వరలోనే తెలంగాణలో ఉచిత స్కూటీలు

ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తరఫున ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజాభవన్‌లో ఘనంగా జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం.. మహిళా సాధికారతకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు... త్వరలోనే ఈ ఉచిత స్కూటీల పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు, గృహలక్ష్మి పథకం ద్వారా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇవ్వడం ద్వారా వారి విద్యకు, స్వావలంబనకూ మరింత తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు.

**హైదరాబాద్‌కు కాలుష్య విముక్తి** నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు మరో భారీ నిర్ణయాన్ని సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో కాలుష్యమే పెద్ద అడ్డంకిగా మారిందని, ఇది నాన్ లివింగ్ సిటీగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు.

# స్వాతి వేడుకలు

బనగానపల్లె శివారులో ఉండే రవ్వలకొండ మీద వెలసిన శ్రీ శ్రీ శ్రీ చెంచులక్ష్మి సమేత పావని నరసింహ స్వామి దేవస్థానం నందు స్వాతి వేడుకలు వైభవంగా జరిగాయని, ఆ దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, ధర్మకర్త, నిర్మాణకర్త, విశ్వహిందూ పరిషత్ ప్రచారకులు మరియు ప్రధాన అర్చకులు అయినటువంటి బాలిశెట్టి పావన నరసింహమూర్తి విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఉదయం నుంచి కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు అభిషేకాలు ఆకు పూజ జరిగాయని ఆయన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఇందులో భాగంగా కడప నుండి విశ్వం వెంకటేశ్వర్లు స్వాతి ప్రొద్దుటూరు నుంచి శ్వేత రమణమ్మ వెంకటలక్ష్మి కన్నయ్య మొదలైన వారు స్వామిని దర్శించుకుని స్వామి యొక్క ఆశీర్వాదాలు పొందారని ఆయన ఆయన తెలియజేశారు.

## మహిళలను గౌరవిస్తూ ఆదర్శంగా నిలిచిన మద్రిపాడు ఎస్సై

### స్వీపర్ లక్ష్మికి ఘన సత్కారం



**మద్రిపాడు మార్చి 8 నంది పత్రిక:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మద్రిపాడు పోలీస్ స్టేషన్‌లో సేవలందిస్తున్న స్వీపర్ లక్ష్మిని మద్రిపాడు ఎస్సై కాసుల శ్రీనివాసరావు మరియు పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.పోలీస్ స్టేషన్ పరిశుభ్రత కోసం ఆమె నిత్యం అంకితభావంతో చేస్తున్న సేవలను అభినందిస్తూ పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. ఎంతో సాధారణమైన విధి అయినప్పటికీ, పరిశుభ్రతకు ఆమె చేస్తున్న కృషి పోలీస్ స్టేషన్ వాతావరణాన్ని శుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని ఎస్సై తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై కాసుల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో ప్రతి మహిళ పాత్ర ఎంతో గొప్పదని, తమ తమ బాధ్యతల్లో మహిళలు అంకితభావంతో పనిచేస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్నారని అన్నారు. మహిళలు ఎక్కడ పనిచేసినా తమ కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.సమాజంలో సేవ చేస్తున్న మహిళలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మహిళలను గౌరవించే సంస్కృతి సమాజంలో మరింత పెరగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్వీపర్ లక్ష్మిని సత్కరించిన మద్రిపాడు పోలీస్ స్టేషన్ కార్యక్రమం మండల ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. మహిళలను గౌరవించే విషయంలో ఆదర్శంగా నిలిచిన ఎస్సై కాసుల శ్రీనివాసరావు చర్యలను స్థానికులు అభినందించారు.

## ప్రకృతి సాగు ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులకు ప్రోత్సాహం ఇచ్చిన మంత్రులు:

### బిసి జనార్ధన్ రెడ్డి - ఫరూక్




**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 8 ( నంది పత్రిక )** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాలలోని ఎన్టీఆర్ టౌన్ హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ను రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి శ్రీ బీసీ జనార్ధన్ రెడ్డి గారు మరియు మైనారిటీ సంక్షేమ, న్యాయ మరియు శాసన శాఖ మంత్రి చీవీణ ఫరూక్ గారు సందర్శించారు. స్టాల్‌లో నన్నారి బాటిల్స్, మిల్లెట్స్, అడివి తేనె, పీఎండీఎస్ కిట్స్, ఘన జీవామృతం పిడకలు, ఆకుకూరలు, కూరగాయలు, పసుపు, కారంపొడి, దేశీవాలి రకాల బియ్యం వంటి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. మంత్రులు స్టాల్‌ను పరిశీలించి, రైతులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా బిసి జనార్దన్ రెడ్డి గారు బ్లాక్ రైస్ మరియు రెడ్ రైస్ కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించి ప్రకృతి విధానాల్లో సాగు చేయడం వల్ల భూసారం కాపాడబడటంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. ఇలాంటి ఉత్పత్తులను ప్రజలు ఎక్కువగా వినియోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రకృతి పద్ధతుల్లో సాగు చేసిన ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ స్టాల్‌కు వచ్చిన స్పందన ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





# మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి







### - మంత్రి ఎన్ఎండి ఫరూక్
### ప్రతి రంగంలో మహిళలకు సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం
### - మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 08 ( నంది పత్రిక )** మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావడమే సమాజ పురోగతికి పునాది అని జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. విద్య లేనివాడు ప్రపంచంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేడని, ప్రతి కుటుంబం పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల చదువును ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతిలో చాలా మంది మహిళలే ఉన్నారని ఆయన తెలిపారు. వివాహం అయిన తర్వాత కూడా పిల్లలను చూసుకుంటూ చదువు కొనసాగిస్తూ పరీక్షలకు హాజరవుతున్న మహిళల పట్టుదల అభినందనీయం అన్నారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ పరీక్షలను మళ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ప్రారంభం కావడం వల్ల యువతకు మంచి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో మహిళలు అధిక శాతం ఉండటం మహిళల చైతన్యాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో జనన రేటు తగ్గిపోతున్న నేపథ్యంలో మానవ వనరుల అభివృద్ధి ఎంతో కీలకమని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. యువత సంఖ్య పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, సమతుల్య జనాభా దేశ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందిస్తోందని ఆయన తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను నిలబెట్టడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఒక ముస్లిం మహిళ తన కృషితో సంవత్సరానికి దాదాపు రూ.36 లక్షల ఆదాయం సంపాదిస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉదాహరణను మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి మహిళలు సమాజానికి ప్రేరణగా నిలుస్తారని, వారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆడపిల్లల వివాహాల కోసం 'షాదీ ముబారక్' వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగం సహా అనేక ఉపాధి రంగాల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒక ఇంటి నిర్మాణంలోనే అనేక రకాల పనులు ఉంటాయని, వాటిని నేర్చుకుంటే స్థానిక యువతకు మంచి ఆదాయం లభిస్తుందని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

**మహిళల పురోగతే నిజమైన అభివృద్ధి – రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళలందరికీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన చారిత్రక నిర్ణయం తీసుకున్న నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన గుర్తు చేశారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా మహిళలకు ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మహిళలు వ్యవసాయం, వ్యాపారం, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదుగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. అంతకుముందు మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి లీలావతి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకట దాసు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.









# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్‌బీసీ కాలనీలో భావోద్వేగభరిత వేడుకలు





**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 8 ( నంది పత్రిక ).** నంద్యాల పట్టణంలోని వా=దీజ కాలనీలో ఉన్న పరివర్తన లైఫ్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శిల్పా మహిళా సహకార సంఘం చైర్మన్ నాగినీ రవి సింగారెడ్డి హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నాగినీ రవి సింగారెడ్డి మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలబడి వారిని స్వయం సమృద్ధిగా నిలబెట్టడం సమాజం మొత్తం బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పోషకాహార కిట్స్‌ను అందజేశారు. చిన్నారుల ఆరోగ్యం, భవిష్యత్తు బలంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. అనంతరం పిల్లలతో కొంతసేపు సరదాగా గడిపి వారితో మమేకమయ్యారు. చిన్నారులతో మాట్లాడుతూ వారిలో ఆనందాన్ని నింపుతూ,

వారికి ప్రోత్సాహం ఇచ్చారు. ఈ సందర్భంగా పిల్లల ముఖాల్లో కనిపించిన చిరునవ్వులు అక్కడి వారందరినీ భావోద్వేగానికి గురి చేశాయి.

ఈ కార్యక్రమంలో పూర్ణిమ, దాల్ మిల్ అమీర్, ఐతీ మొహమ్మద్ రఫీ, ఐతీ జాస్మిన్ సుల్తానా,ఐతీ వైష్ణవి మరియు స్థానిక మహిళలు, సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.





## రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు సంచలన ఆరోపణలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు సంచలన ఆరోపణలు చేశారు. మా జాతి సమస్యలు చెప్పుకుందామని రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రిని కలవడానికి ప్రయత్నిస్తున్నానని, కానీ ఆయన దొరకడం లేదని అన్నారు. 200 సార్లు ఫోన్ చేసినా తన ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం కోసం అడుగుదామని ప్రయత్నిస్తే కలవడానికి అవకాశం రావడం లేదని అన్నారు. ఐదు ఎకరాల భూమి ఇస్తే తాము మాదిగ భవనం నిర్మించుకుంటామని తెలిపారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో తమ వర్గానికి అన్ని చోట్ల అన్యాయమే చేశారని ఆరోపించారు. నిన్న జరిగిన మాదిగల సన్మాన సభకు తనను పిలవలేదని ఆవేదన చెందారు. ముఖ్యమంత్రి తనను పిలవలేదు కాబట్టి నిర్వాహకులు కూడా పట్టించుకోలేదేమో అని వాపోయారు. తాను కూడా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, ఎంతకాలమైనా ముఖ్యమంత్రి పదవిలో ఉండు... నిన్ను మా భుజాన మోస్తాం అని రేవంత్ రెడ్డితో చెప్పానని, కానీ ఆయన మాత్రం తనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని వాపోయారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సుమారు 900 మంది

## పోలీస్ అధికారులు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు...



భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ

కొత్త బురుజు గ్రామం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తున్న స్పెషల్ పోలీస్ బలగాలు...

నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి....

సీసీ కెమెరాలతో మరియు డ్రోన్ కెమెరాలతో నిఘా కట్టుదిట్టం....

విధులలో నిర్లక్ష్యం వహించరాదు....

నంది పత్రిక –డోన్ నంద్యాల జిల్లాలోని డోన్ మండలం కొత్తబురుజు గ్రామం నందు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న సందర్భంగా సుమారు 900 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తెలిపారు.వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగింది.ఇప్పటికే కొత్త బురుజు గ్రామం మరియు పరిసర ప్రాంతాలను ఇప్పటికే స్పెషల్ పార్టీ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు జరిగింది ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో పోలీస్ జాగిలాలతో మరియు బాంబు డిటెక్షన్ టీం సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది.సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాలతో నిరంతరం భద్రతా పర్యవేక్షణ జరుగుతుంది.కొత్తబురుజు గ్రామంలో నిర్వహించే సభా ప్రాంగణానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చే అవకాశం ఉన్నందున



ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల పార్కింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. బందోబస్తుకు వచ్చిన అధికారులను సిబ్బందిని సమావేశపరిచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత నిర్వహించాలని దిశ నిర్దేశం చేయడం జరిగింది.ఎట్టి పరిస్థితులలో మీకు నియమించిన డ్యూటీ ప్రదేశాన్ని వదిలి వెళ్ళ రాదని ప్రజలు ఎక్కువగా తరలివచ్చే అవకాశం ఉన్నందున మీరు విధులు నిర్వహించు ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తతో విధులు నిర్వహించాలి.డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది విధులలో నిర్లక్ష్యం వహించరాదని, మీకు అప్పగించిన విధులను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

# శిల్పా సంస్థల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు!

## మహిళల ఆనందోత్సాహాల మధ్య మహిళా దినోత్సవ వేడుకలు..






నంద్యాల సిటీ బ్యూరో మార్చి 8 ( నంది పత్రిక ). శిల్పా మహిళా సహకార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శిల్పా సేవా సమితి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి శిల్పా మహిళా సహకార్ చైర్మన్ నాగినీ రవి సంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల కోసం క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళల ప్రతిభను ప్రోత్సహిస్తూ సమాజంలో వారి పాత్ర ఎంతో గొప్పదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా శిల్పా సూపర్ మార్కెట్, శిల్పా డిజిటల్ టీవీ, వైఎస్సార్ గల్లీ దవాఖాన, శిల్పా మహిళా బ్యాంక్ లో పని చేసే ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు. శిల్పా సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను తమ కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ వారికి ప్రోత్సాహం అందిస్తున్నారని మహిళలు హర్షం వ్యక్తం చేశారు.




# డోన్ ఎమ్మెల్యే సమక్షంలో భారీ చేరికలు





## టీడీపీలోకి 30 కుటుంబాలు

నందిపత్రిక –డోన్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరుతున్నారని డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ముఖ్యమైన రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్యాపిలి మండలం రాచర్ల గ్రామం రామచంద్ర రెడ్డిల నాయకత్వంలో సుమారు 30 కుటుంబాలు వైఎస్సార్సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ప్రభుత్వ పనితీరుపై నమ్మకంతోనే ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు.

**కార్యకర్తలకు అండగా..** పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని, కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

రాచర్ల రామచంద్ర రెడ్డిలతో పాట తిరుమల్ రెడ్డి సూర్యనారాయణ రెడ్డి వడ్డే వెంకట రాముడు

పూజారి రాము బి. కంబగిరి రాముడు ఏల్. కంబగిరి రాముడు ఈడిగ శీను కె. రమణ బోయ సూర్యుడు ఇమామ్ సాహెబ్ చాకలి మురళి

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ మూర్తితో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయకత్వంలో డోన్ నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు ఈ సందర్భంగా ప్రకటించారు.

# ముఖ్యమంత్రి డోన్ పర్యటనకు సర్వం సిద్ధం:

## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కోట్ల



నందిపత్రిక –డోన్ ముఖ్యమంత్రి పర్యటనను చారిత్రాత్మక విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రేపు డోన్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో, సభా ప్రాంగణం మరియు రూట్ మ్యాప్‌ను ఎమ్మెల్యే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు కార్యక్రమ ప్రాంగణం వద్ద నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా కొనియాడారు. వారి పనితీరును అభినందిస్తూ, వారికి క్లీనింగ్ కిట్లను అందజేశారు. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని ఈ సందర్భంగా ఆయన సూచించారు.అన్ని శాఖల అధికారులు ఒకరికొకరు సహకరించుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సభకు భారీగా తరలివచ్చే ప్రజలకు ఎండ తగలకుండా నీడ, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలి. సీఎం కాన్వాయ్‌కు, సభకు వచ్చే వాహనాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పక్కాగా ఉండాలి. నిబంధనల ప్రకారం అతిథులందరికీ తగిన గౌరవం, వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిస్ నర్ ప్రసాద్ గౌడ్, డీసీ ఎం ఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, సుదర్శన్, ప్రసాద్ రెడ్డి,తూర్పు లింగారెడ్డి,కొంగనపల్లె మధు,మహేష్ పాల్గొన్నారు.



## అహ్మదాబాద్ స్టేడియంలో నారా లోకేశ్ సందడి..

అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఈ తుది పోరును ఆయన స్టేడియంలో కూర్చుని ప్రత్యక్షంగా తిలకించారు. ప్రత్యేకంగా టీమిండియా జెర్సీని ధరించి స్టాండ్స్‌లో కనిపించిన లోకేశ్.. భారత ఆటగాళ్లను ఉత్సాహపరుస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా స్టేడియంలో పలువురు ప్రముఖులను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ కపిల్ దేవ్‌ను కలుసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. అలాగే ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్సెలార్ మిట్టల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్య మిట్టల్‌తో కూడా లోకేశ్ భేటీ అయ్యారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలోనే వీరితో కాసేపు ముచ్చటించారు. అంతేకాదు, టీమిండియా దిగ్గజాలు ధోనీ, రోహిత్ శర్మ, వెంకటేశ్ ప్రసాద్ లో పాటు ఐసీసీ చైర్మన్ జై షాను కూడా లోకేశ్ ఈ సందర్భంగా కలిశారు. దీనికి సంబంధించిన ఫొటోలను మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఆదిత్య మిట్టల్‌తో భేటీ సందర్భంగా ఏపీ పారిశ్రామిక ప్రగతికి సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావించారు. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కానున్న విషయం తెలిసిందే.

# నంద్యాల మహిళా వైద్యుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

స్త్రీ వ్యాధులపై వైద్య సదస్సు నిర్వహించిన నంద్యాల గైనకాలాజి సొసైటీ

సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద లకు మహిళా దినోత్సవ సత్కారం

మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత: డాక్టర్ నాగమణి,డాక్టర్ వసుధ

నంద్యాల సిటీ బ్యూరో మార్చి 8 ( నంది పత్రిక ) ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల గైనకాలాజి సొసైటీ, నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో, గైనకాలాజి సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగమణి, డాక్టర్ వసుధ, కోశాధికారి డాక్టర్ సునీత ల నిర్వహణలో మధుమణి సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో గైనకాలాజి సొసైటీ స్త్రీ వ్యాధుల పై వైద్య సదస్సు నిర్వహించారు. సదస్సులో వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ ఇందుమతి, డాక్టర్ వసుధ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ గీత, డాక్టర్ శిల్పా, డాక్టర్ సునీత వివిధ స్త్రీ వ్యాధులపై మల్టీ మీడియా సహకారంతో ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐ ఎం ఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు




డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర ఐ ఎం ఎ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు,డాక్టర్ మధుసూదన రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళ లను అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ నాగమణి,డాక్టర్ వసుధ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ “గివ్ టు గైయిన్” నినాదం ప్రకారం మహిళల హక్కులు,సామాజిక న్యాయం కోసం కార్యచరణ ప్రధానం అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద లకు మహిళా దినోత్సవ సత్కారం చేశారు. నవజీవన్ బధిరుల పాఠశాల బాలికలకు రెండు కుట్టు మిషన్లు కుట్టు పని శిక్షణ కోసం మహిళా వైద్యుల తరఫున ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా వైద్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ విజేత టీమిండియాకు ప్రధాని మోదీ అభినందనలు

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు చరిత్ర సృష్టించింది. ఇవాళ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించి విశ్వవిజేతగా నిలిచింది. ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా.. కివీస్ జట్టుపై ఏకంగా 96 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి కప్‌ను ముద్దాడింది. ఈ విజయంతో దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. భారత జట్టు సాధించిన ఈ అద్భుత విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. “ఛాంపియన్స్.. టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టుకు హృదయపూర్వక అభినందనలు” అంటూ ప్రధాని ప్రశంసించారు. ఈ గెలుపు జట్టు అద్భుతమైన నైపుణ్యాలు, దృఢ సంకల్పం, టీమ్ వర్క్‌కు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

టోర్నమెంట్ ఆసాంతం భారత ఆటగాళ్లు చూపిన పోరాట పటిమ అమోఘమని మోదీ కొనియాడారు. ఈ విజయం ప్రతి భారతీయుడి గుండెను గర్వంతో, ఆనందంతో నింపిందని తెలిపారు.

“వెల్ డన్ టీమ్ ఇండియా” అంటూ ప్రధాని తన సందేశంలో భారత ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. సొంతగడ్డపై జరిగిన ఈ మెగా టోర్నీలో భారత జట్టు కప్ గెలవడం క్రీడా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి బ్యూరో చీఫ్ మార్చ్ 8 నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మార్చి 9వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎన్.మౌర్య తెలియజేశారు.

## నో స్మోకింగ్ డే (ధూమపాన వ్యతిరేక దినోత్సవం)

**మీ ఊపిరిని పొగతో నింపకండి,ప్రాణవాయువుతో నింపండి..**


**ధూమపానం కేవలం ఊపిరితిత్తులకే కాదు, శరీరంలోని ప్రతి భాగానికి హాని చేస్తుంది..**

**విష్ణ హాస్పిటల్ ప్రముఖ ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డా.కె.వెంకట మనోహర్.**




**నంద్యాల మార్చి08 నంది పత్రిక:** ధూమపాన వ్యతిరేక దినోత్సవం అనేది ధూమపానం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించడం మరియు ధూమపానం మానేయాలనుకునే వారికి మద్దతు ఇవ్వడం ప్రధాన ఉద్దేశ్యం.దీనికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలను విష్ణ హాస్పిటల్ ప్రముఖ ఊపిరితిత్తుల వైద్యుని పునులు డాక్టర్ కే వెంకట మనోహర్ వివరించారు.ధూమపానం వల్ల కలిగే ఆరోగ్య నష్టాల కేవలం ఊపిరితిత్తులకే కాదు, శరీరంలోని ప్రతి భాగానికి హాని చేస్తుంది అని పేర్కొన్నారు.అధిక ధూమపానం వల్ల క్యాన్సర్ వస్తుందని తెలిపారు.క్యాన్సర్ ఊపిరితిత్తులు, నోరు, గొంతు మరియు అన్నవాహిక క్యాన్సర్లకు ప్రధాన కారణం. గుండె జబ్బులు కూడా అది తక్కువ వయసులో రావచ్చని పేర్కొన్నారు.గుండె జబ్బులు రక్తనాళాలు కుంచించుకుపోయి రక్తపోటు పెరుగుతుంది, ఇది గుండెపోటుకు దారితీస్తుంది. అలాగే శ్వాసకోశ సమస్యలు ఆస్తమా,బ్రోన్కైటిస్ మరియు సిఓపిడి వంటి దీర్ఘకాలిక సమస్యలు వస్తాయాని,చర్మంపై ముడతలు రావడం, దంతాలు పసుపు రంగులోకి మారడం మరియు నోటి దుర్వాసన కలుగుతుందన్నారు.ధూమపానం మానేయడం కష్టంగా అనిపించవచ్చు,కానీ సరైన ప్రణాళికతో ఇది సాధ్యమే.మీరు ఎందుకు మానేయాలనుకుంటున్నారో ఒక చోట రాసుకోండి(ఉదా: ఆరోగ్యం కోసం,కుటుంబం కోసం).సిగరెట్ తాగాలనిపించినప్పుడు నీళ్లు తాగడం,షుగర్ లేని చూయింగ్ గమ్ నమలడం వంటివి చేయలానీ తెలిపారు. వ్యాయామం,యోగా లేదా ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. ధూమపానం మానేస్తున్నట్లు మీ స్నేహితులకు,కుటుంబ సభ్యులకు చెప్పండి.వారు మిమ్మల్ని ప్రోత్సహిస్తారూ అని కోరారు.ధూమపానం ప్రాణాంతకం.మీ ఊపిరిని పొగతో నింపకండి, ప్రాణవాయువుతో నింపండి అని కోరారు.ధూమపానం మానేసిన కేవలం 24 గంటల్లోనే మీ గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గడం మొదలవుతుందనీ,ఈ రోజు నుండే ఆరోగ్యకరమైన జీవితానికి నాంది పలకండి అని తెలిపారు.

## పలు శుభకార్యాల్లో పాల్గొన్న ఏపీ ఎస్ ఎస్ డి సిపల్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి



**నందిపత్రిక -డోన్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ఆదివారం నంద్యాల, డోన్, బేతంచెర్ల మరియు ప్యాపిలి నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి పలు వివాహ వేడుకలు, గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నంద్యాల పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్లో జరిగిన కీ.శే. కెంచె విజయ్ కుమార్తె రూపిక వివాహ వేడుకకు ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం యాతం జయచంద్రారెడ్డి గార్డెన్స్లో జరిగిన జోష్న - జశ్వంత్ రెడ్డిల వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.?బేతంచెర్ల పట్టణంలోని చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపంలో జరిగిన సూరజ్ - ప్రజ్ఞల వివాహానికి హాజరయ్యారు. అదేవిధంగా పట్టణంలోని శివారామిరెడ్డి నూతన గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. డోన్ పట్టణంలోని ఇందిరానగర్లో నివసించే ధర్మవరం గ్రామానికి చెందిన బోయ రోగన్న కుమార్తె వివాహ వేడుకకు చైర్మన్ హాజరయ్యారు. న్యూ మధు ఫంక్షన్ హాల్లో జరిగిన జగదుర్తి ప్రతాప్ రెడ్డి కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఎం కన్వెన్షన్ హాల్లో జరిగిన హరి ప్రసాద్ - హారికల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్యాపిలి పట్టణంలోని బి.సి. కాలనీకి చెందిన ఆదోని నీలేంద్ర కుమారుడి వివాహ వేడుకలో మన్నె సుబ్బారెడ్డి పాల్గొని నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. ఈ పర్యటనల అంతటా స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని చైర్మన్ ఘన స్వాగతం పలికారు.



# విద్యార్థులు మొబైల్ ఫోన్లను వినోదానికి కాకుండా. ఆన్లైన్ క్లాసులు విని కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలి.







**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 8 ( నంది పత్రిక ).**
విద్యార్థులు మొబైల్ ఫోన్లు ను వినోదానికి కాకుండా,ఆన్ లైన్ క్లాసులు విని కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి ఉపయోగించుకోవాలని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మెన్,ప్రొపెసర్ డాక్టర్ జి.రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు.నంద్యాల పట్టణంలోని స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల (అటానమస్) వేదికగా నిర్వహించిన లి"కెమరూన్-2ఖ 26 అను పేరున నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సదస్సు ముగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి లికళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయగా, డా. యు.వి.ఎస్. కుమార్ , ప్రోగ్రామ్ కన్వీనర్ శ్రీ ఎస్. వెంకట్రావు అధ్యాపకులు ప్రత్యూష, దివ్యలత, సుష్మా, రహీమూన్, మాధవ రెడ్డి ఇతర కళాశాలల ప్రతినిధులుగా, విశ్వనాథ్ రజినీ కిరణ్మయి , కుమార్ శమీఉల్లా హాజరయ్యారు. వీరితో పాటు వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, "కార్యక్రమాల నిర్వహణపై విద్యార్థుల నుంచి వచ్చే స్పందన మాకు ఎంతో కీలకం. నేటి విద్యా విధానంలో వస్తున్న మార్పులను గమనించి, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా ఐఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థల సర్టిఫికేషన్లకు మంచి విలువ ఉంటుంది. విద్యార్థులు మొబైల్ ఫోన్లను కేవలం వినోదానికే కాకుండా, ఆన్లైన్ క్లాసులు విని కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి ఉపయోగించుకోవాలి" అని సూచించారు. విద్యార్థులారా, ఏదైనా ఒక కార్యక్రమం విజయవంతం కావాలంటే కేవలం నిర్వాహకుల కృషి మాత్రమే సరిపోదు, అందులో పాల్గొనే మీ స్పందన చాలా ముఖ్యం. మేము ఎప్పుడూ వేదికపై నుంచి మాట్లాడుతూనే ఉంటాము, కానీ ఈ రోజు మీ మాట వినాలనుకుంటున్నాము. ఈ ప్రోగ్రామ్లో మీకు నచ్చినవి ఏమిటి? ఇంకా మెరుగుపరచాల్సిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అనేది మాకు తెలియజేయండి. మీ అధ్యాపకులు చదువుకునే రోజులకు, నేటి తరం విద్యార్థులు చదువుతున్న రోజులకు మధ్య చాలా మార్పు వచ్చింది. నేడు అవకాశాలు మీ ముంగిట ఉన్నాయి. ముఖ్యంగా 'మొబైల్ ఫోన్' అనేది కేవలం కాలక్షేపానికి మాత్రమే కాదు, అది ఒక అద్భుతమైన విద్యా పరికరం. ఐఐటి వంటి సంస్థలు అందించే ఆన్లైన్ కోర్సులు పూర్తి చేసి, ధృవపత్రాలు సాధించండి. అటువంటి సర్టిఫికెట్లకు సమాజంలో, ఉద్యోగ విపణిలో చాలా విలువ ఉంటుంది. మీ బంగారు భవిష్యత్తుకు ఇవే పునాదులు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల్లో మీరు ఇలాగే ఉత్సాహంగా పాల్గొనాలని కోరుకుంటున్నాను."

కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి ణతీ. యూ.వి.ఎస్. కుమార్ మాట్లాడుతూ "నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే కేవలం చదువు మాత్రమే సరిపోదు, 'నిర్ణయం తీసుకునే శక్తి"వ్యక్తిగత నైపుణ్యాలు' చాలా అవసరం. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. 'పెద్ద కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోవడానికి కష్టపడండి'. నేడు అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతికతను మీకు అనుకూలంగా మలచుకోండి. క్రమశిక్షణతో కూడిన హార్డ్ వర్క్ మిమ్మల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది అని తెలిపారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం అలవర్చుకోవాలని తెలిపారు. "పెద్ద కలలు కనండి, వాటిని సాధించడానికి కష్టపడండి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇతర కళాశాలల నుండి ప్రతినిథిగా వచ్చిన అధ్యాపకులు విశ్వనాథ్ మాట్లాడుతూలి ఈ కళాశాలతో మాకు విడదీయలేని అనుబంధం ఉంది. మేము విద్యార్థులుగా ఉన్నప్పుడు ఇక్కడ నిర్వహించిన ఎన్నో పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాము. ఆ జ్ఞాపకాలు ఎప్పటికీ మరువలేము. మమ్మల్ని ఆహ్వానించిన చైర్మన్ గారికి కృతజ్ఞతలు. విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడానికి ఇటువంటి వేదికలు నిరంతరం కొనసాగాలి అని తెలిపారు. అధ్యాపకులు రజనీ కిరణ్మయి మాట్లాడుతూ, "నేడు ఇక్కడ ఇంతమంది ఉత్సాహవంతులైన విద్యార్థులను చూడటం చాలా సంతోషంగా ఉంది. మా విద్యార్థులు సోమవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొని, అద్భుత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. అదే ఉత్సాహంతో ఈ రోజు కూడా 'కెమరూన్-2ఖ26' లో పాల్గొనడం మాకు గర్వకారణంగా ఉంది. విద్యార్థులకు ఇటువంటి అవకాశాలు కల్పిస్తున్న యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను అని తెలిపారు.

**అధ్యాపకులు కిరణ్, షమీఉల్లా మాట్లాడుతూ** "శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎప్పుడూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేస్తుంది. మేము అనేకసార్లు ఇక్కడికి రావడం జరిగింది. ప్రతిసారీ ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకునేలా ఇక్కడ కార్యక్రమాలు ఉంటాయి. ఈ రోజు నిర్వహించిన పోటీలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి అని తెలిపారు. కార్యక్రమం విద్యార్థులు ప్రతిస్పందిస్తూ .... "ఇటువంటి కార్యక్రమాలు మాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి. పుస్తకాలకే పరిమితం కాకుండా, మాలో ఉన్న సృజనాత్మకతను, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించుకోవడానికి ఇదొక మంచి అవకాశం. ఈ పోటీలలో పాల్గొనడం మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. విజేతల వివరాలు ఇలా ఉన్నాయి:

1. టెక్నికల్ క్విజ్

ప్రథమ బహుమతి: ఎం. లక్ష్మీ సౌమ్య, ఎస్. అల్లిపిషా, కె. ఆకాంక్ష (బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల).

ద్వితీయ బహుమతి: కె. ఈశ్వర్, ఎస్. అబ్దుల్ అజీజ్, బి. సాయి శ్రీనివాస్ (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల).

తృతీయ బహుమతి: బి. ప్రణీత, ఈ. శ్రీనిత్య, ఎస్. మమత (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల).

2. కోడ్ క్వెస్ట్ -- ప్రోగ్రామ్మింగ్ కాంపిటీషన్

ప్రథమ బహుమతి: జయలక్ష్మి, భవ్యశ్రీ, సంధ్యారాణి (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల).

ద్వితీయ బహుమతి: షాహిన, నందిని (బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల).

తృతీయ బహుమతి: ఫరూక్, అజ్మత్ హుస్సేన్, సయ్యద్ అబ్దుల్ ముఖేత్ పీర్ (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల).

3. పేపర్ ప్రజెంటేషన్

ప్రథమ బహుమతి: లిఖిత రెడ్డి, సుమయ్య (సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల).

ద్వితీయ బహుమతి: మాధురి, లిఖిత (బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల).

తృతీయ బహుమతి: దీపిక (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల).

4. సాంస్కృతిక పోటీలు

గానం : ప్రథమ బహుమతి - బి. సాయి శ్రీనివాస్ (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల).

నృత్యం

ప్రథమ బహుమతి: ఎ. ప్రదీప్ కుమార్ (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల).

ద్వితీయ బహుమతి: ఎస్. ఇందుశ్రీ సుమతి (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల).

విజేతలకు జ్ఞాపికలు , ధ్రువపత్రాలు ముఖ్య అతిధి చేతుల మీదుగా అందజేయబడిన తరువాత, కళాశాల సంప్రదాయం ప్రకారం, కార్యక్రమం యొక్క కన్వీనర్, కో-కన్వీనర్లను, కళాశాల చైర్మన్ మరియు విద్యార్థులు జ్ఞాపికలు తో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ డిపార్ట్మెంట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు. చివరగా జాతీయగీతాలాపన తో కార్యక్రమం ముగిసింది.







# బోడె రామచంద్ర యాదవ్ సమక్షంలో బిసివై పార్టీలో భారీ చేరికలు

### 500 మంది నాయకులు, కార్యకర్తలు బిసివై పార్టీలో చేరిక బహుజన రాజకీయ శక్తి బలోపేతమే లక్ష్యం

**కాశినాయన మార్చి 8 (నంది పత్రిక):** బద్వేల్ నియోజకవర్గం కాశినాయన మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో రేగులగడ్డ వారి కుటుంబంలో నిర్వహించిన కేశ ఖండన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన పోరుమామిళ్ల పట్టణానికి చేరుకుని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నాయకులు, కార్యకర్తలతో కలిసి గొంటువారిపల్లె గ్రామానికి వెళ్లి కేశ ఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.తరువాత జరిగిన కార్యక్రమంలో బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బిసివై పార్టీలో చేరారు. దాదాపు 500 మంది నాయకులు, కార్యకర్తలు పార్టీ కండువా కప్పుకుని బిసివై పార్టీలో చేరడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీ నాయకులు వారిని సాదరంగా ఆహ్వానిస్తూ పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ కాశినాయన మండలంతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని తెలిపారు. ఈ మండలానికి పెద్దల ఆహ్వానం మేరకు ఇప్పటికే మూడు సార్లు వచ్చానని, ఇక్కడి ప్రజలతో ముఖ్యంగా బీసీ సోదరులతో కలవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని తాను సంకల్పించుకున్నానని చెప్పారు. అలాగే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలను, ముఖ్యంగా రాయలసీమ ప్రాంత ప్రజలను మోసం చేస్తోందని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్ధపు మాటలతో ప్రజలను నమ్మించి ఇప్పుడు నట్టేట ముంచారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కొన్ని వర్గాలకే పరిమితమయ్యాయని, సామాన్య బహుజన వర్గాలకు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని అన్నారు.మన రాష్ట్రంలో ఎప్పుడూ రెడ్డి ప్రభుత్వమో లేక నాయుడు ప్రభుత్వమో మాత్రమే ఉంటుందా అనే ప్రశ్నను ప్రజల ముందు ఉంచుతూ బహుజన వర్గాల రాజకీయ శక్తిని పెంచేందుకు బిసివై పార్టీని స్థాపించామని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కలిసి బహుజన శక్తిగా ఎదిగితేనే నిజమైన రాజకీయ మార్పు సాధ్యమవుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో బద్వేల్ నియోజకవర్గం నుంచే బిసివై పార్టీ బలోపేతం ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయి



నుంచి పార్టీని విస్తరించి ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసివై పార్టీ పూర్తిస్థాయిలో పోటీ చేస్తుందని, ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిపిరిబోయిన రమేష్ యాదవ్, రామమోహన్, నూరె నిర్మలా, రేగులగడ్డ నారాయణ, శ్రీవరపు నరసింహా యాదవ్, పోలు మురళి కృష్ణ యాదవ్, రామయ్య, ఉంటా నరసింహా, శ్రీనివాసులు, సూర్యనారాయణ, హుస్సేనయ్య, బాలకృష్ణ, గురప్పుడు, చిన్న నారాయణ, మాధవ్, కిట్టయ్య, తిరపతయ్య, బాలారోశయ్య, బాల పిచ్చయ్య, బాల ఇసాయ్య పాల్గొన్నారు.



# మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ, ఆరోగ్యం, ఆనందం అనే మూడు అంశాలు ఉంటే కుటుంబం, సమాజం మరింత బలపడుతుంది





## మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

**ప్రతి మహిళ తన శక్తి సామర్థ్యాలను గుర్తించి కుటుంబంతో పాటు సమాజం, దేశ అభివృద్ధికి తోడ్పడాలి**

**మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి**

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య**

తిరుపతి, బ్యూరో చీఫ్ మార్చి 8: నంది పత్రిక

మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మౌర్య తదితరులతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సాధికారత, అభివృద్ధి మరియు సమాజంలో వారి పాత్రను గుర్తించి గౌరవించేందుకు మహిళా దినోత్సవం ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తుందని తెలిపారు. మహిళలు కుటుంబం మరియు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల జీవితంలో ఆర్థిక స్వేచ్ఛ, ఆరోగ్యం, ఆనందం అనే మూడు అంశాలు ఎంతో ముఖ్యమని, ఇవి ఉంటే కుటుంబం మరియు సమాజం మరింత బలపడుతుందని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా లక్షపతి దీదీ కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలపరచడం జరుగుతుందని చెప్పారు. తిరుపతి జిల్లాలో సుమారు 1.60 లక్షల లక్షపతి దీదీలు ఉన్నారని పేర్కొన్నారు. డిఆర్డిఏ, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడుతున్నదని చెప్పారు. గత ఏడాదిలో జిల్లాలో 10 వేలకుపైగా మహిళా పారిశ్రామికవేత్తలు తయారయ్యారని వెల్లడించారు. మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి నెలకు ?50--60 వేల వరకు ఆదాయం పొందుతున్న ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో డిఆర్డిఏ, మెప్మా ఆధ్వర్యంలో 14,600 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వాటిలో రెండు లక్షలకుపైగా మహిళలు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. గత 11 నెలల్లోనే సుమారు ?2,600 కోట్లకు పైగా రుణాలు మహిళా సంఘాలకు అందించామని తెలిపారు.మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందించడం వల్ల మహిళల ఆరోగ్యం మెరుగుపడిందన్నారు. తిరుపతి జిల్లాలో 10 లక్షల 88 వేల కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనం అందుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా మహిళల సౌకర్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి నెల సుమారు 28 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగిస్తున్నారని చెప్పారు. పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు 1 కోటి 85 లక్షల ప్రయాణాలు జరిగాయని, దీనివల్ల మహిళలు ?67 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని తెలిపారు మహిళల ఆరోగ్య రక్షణ కోసం గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య సేవలు, టీకాలు అందిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరంలో జిల్లాలో 15 వేలకుపైగా ప్రసవాలు ఉచితంగా నిర్వహించబడినట్లు చెప్పారు. బాలికల ఆరోగ్య రక్షణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా మరింత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ... అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు కుటుంబ అభివృద్ధితో పాటు సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. గతంలో మహిళలు ఇంటి పనులకు మాత్రమే పరిమితమై ఉండగా, నేడు విద్య, వైద్యం, పరిపాలన, సాంకేతిక రంగాలు సహా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా, కొన్నిచోట్ల మరింత ప్రతిభ కనబరుస్తూ దేశానికి గౌరవాన్ని తెచ్చిపెడుతున్నారని పేర్కొన్నారు. మహిళలు ఇంజినీర్లు, డాక్టర్లు, కలెక్టర్లు, పోలీసు అధికారులు, పైలట్లు వంటి అనేక రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. మహిళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచుతున్నామని అన్నారు. ప్రతి మహిళ తన శక్తి సామర్థ్యాలను గుర్తించి కుటుంబంతో పాటు సమాజం, దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మౌర్య మాట్లాడుతూ..మహిళా హక్కులపై అవగాహన పెంచడం మరియు మహిళా సాధికారత సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. మహిళలకు సమాజంలో అవకాశాలు, మద్దతు కల్పిస్తే వారు మరింత శక్తివంతంగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ సంవత్సరానికి ఐక్యరాజ్యసమితి ప్రకటించిన అనే థీమ్ మహిళలు, బాలికల హక్కులను పరిరక్షించడంతో పాటు వాటిని ఆచరణలో అమలు చేయాలనే సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధిస్తేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని చెప్పారు. అలాగే మహిళల ఎదుగుదలలో మహిళలే మహిళలకు మద్దతుగా నిలవాలని సూచిస్తూ, ప్రతి మహిళ " అనే సంకల్పంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మి, డిప్యూటీ మేయర్ మునికృష్ణ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర ఎస్‌సి సెల్ డైరెక్టర్ కుమారి, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, క్లీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ స్రవంతి తదితరులు మాట్లాడుతూ మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి గారు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ప్రసంగాన్ని వీడియో ద్వారా వీక్షించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 14,604 సంఘాలకు చెందిన 2,23,260 మంది మహిళా సభ్యులకు ?2,616 కోట్ల 22 లక్షల రూపాయల రుణాలను మెగా చెక్కుల రూపంలో అందజేశారు. అలాగే 270 మంది ఎస్సీ మహిళలకు ఉన్నతి, పీఎం అజయ్, ఏపీఎస్‌సీఎఫ్‌సీ ద్వారా సబ్సిడీతో కూడిన ?4 కోట్ల 44 లక్షల 50 వేల రూపాయల రుణాలను మెగా చెక్కుల రూపంలో అందజేశారు.అనంతరం యూనివర్సిటీ ఆవరణంలో డి ఆర్ డి ఏ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, మహిళా పోలీసు వారు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పీడీ, ఐసిడిఎస్ పీడీ, డీఈఓ, మెప్మా పీడీ, జీఎం ఇండస్ట్రీస్, ఎల్‌డీఎం, డిప్యూటీ కమిషనర్, జిల్లా అధికారులు, మహిళా పోలీసులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# మహిళా దినోత్సవం నాడు గ్యాస్ ధరల పెంపు ప్రజలపై భారం



వెలుగోడు, మార్చి08 -- నంది పత్రిక: అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున వంట గ్యాస్ ధరలను పెంచడం సామాన్య ప్రజలపై మరింత భారం మోపిందని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గృహ వినియోగ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంచడం వల్ల ఇప్పటికే ధరల భారంతో సతమతమవుతున్న ప్రజలకు మరింత ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వి. ఏసు రత్నం, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి. రామాంజనేయులు, ఆవాజ్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ రఫీ మాట్లాడుతూ గ్యాస్ ధరల పెంపు చిన్న వ్యాపారులు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. దీని వల్ల ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు మళ్లీ కట్టెల పొయ్యిపై వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఇది ఆరోగ్యానికి హానికరమని సూచిస్తోంది. పెరిగిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రియదర్శిని పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం: అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు




నంది పత్రిక -ప్యాపిలి స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ రసూల్ బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు** వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా: శాస్త్రీయ నృత్యాలు విద్యార్థుల అభినయం ప్రేక్షకులను ముగ్ధులను చేసింది. జానపద కళా రూపమైన కోలాటాన్ని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. రైతుల కష్టాలను కళ్లకు కట్టేలా విద్యార్థులు వేసిన నాటికలు ఆలోచింపజేశాయి. చదువుతో పాటు కళలకూ ప్రాధాన్యం ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పార్థసారథి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఆటపాటల్లో మరియు ఇతర సృజనాత్మక రంగాల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. ఇటువంటి వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అద్భుతమైన వేదికలని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం: విద్యార్థుల తల్లులకు ఘనవందనం వార్షికోత్సవంతో పాటు పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏడవ తరగతి విద్యార్థుల తల్లులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తుండటం గర్వకారణమని హెచ్‌ఎం పార్థసారథి కొనియాడారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీ కోటకు బీటలు

## మహదేవపురం టిడిపి ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు కంప రాజు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైసీపీలో భారీ చేరికలు

శిరివెళ్ల (నంది పత్రిక) : సిరివెళ్ల మండల పరిధిలోని నల్లమల అడవి సమీప గ్రామం మహదేవపురంలో అధికార తెలుగుదేశం పార్టీ కోట బీటలు వారింది. అధికార పార్టీ నేతలు గ్రామంలో చేస్తున్న అక్రమాలు అన్యాయాలపై మహదేవపురం గ్రామంలోని ప్రజలు విసుగు చెంది ప్రజాప్రతినిధులను నిలదీయడం వల్ల ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించడం దేవుడి సొమ్ముతో ఆటలాడవద్దని ఎంత చెప్పినా వినని అధికార పార్టీ నేతల వైఖరికి నిరసనగా గ్రామంలో రాజకీయ సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. వైసిపి యూత్ నేత కంపరాజు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీ వార్డు మెంబర్లు మరియు టిడిపి కార్యకర్తలు సుమారు 200 మంది రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరేందుకు సంసిద్ధం అయ్యారు.గ్రామ ప్రజల ఒత్తిడి మరియు నిర్ణయం మేరకు రాజేష్ గౌడ్ గారు కర్నూలు నంద్యాల ఉమ్మడి జిల్లాల వైసిపి పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి గారి దృష్టికి జిల్లా ఆళ్లగడ్డ అసెంబ్లీ మాజీ ఎమ్మెల్యే గంగుల భీజేంద్రరెడ్డి గారి దృష్టికి తీసుకు వెళ్ళారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు , రాయలసీమ సీనియర్ పొలిటీషియన్ పెద్దాయన శ్రీ. గంగుల ప్రభాకర్ రెడ్డి గారు మాజీ ఎమ్మెల్యే శ్రీ.గంగుల.బ్రిజేంద్రరెడ్డి (నాని) అన్న గారి సమక్షంలో వైయస్ఆర్ ర్ పార్టీ కండువాని కీలక నేతలు ప్రముఖులు కప్పుకున్నారు. ఈ క్రమంలో మహదేవపురం తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది గ్రామానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎక కాలంలో సుమారు 200 మంది వైసిపి లో చేరి పార్టీ కండువ కప్పుకున్నారు. దాదాపు సుమారు 200 మంది తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖ్య అనుచరులు ఒకేసారి పార్టీ మారడంతో మహాదేవపురం గ్రామంలో కంపరాజు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైసీపీలో సంబరాలు అంబరాన్ని అంటాయి .





**తెలుగు దేశం పార్టీ శ్రేణులు డీలా పడ్డాయి.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కార్లు బాడుగకు అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం సుమారు 30 వాహనాలను మహదేవపురం గ్రామానికి రప్పించి వైసిపిలో చేరే గత తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులను ప్రముఖులను కార్యకర్తలను కంపరాజు రాజేష్ గౌడ్ ఆళ్లగడ్డకు తరలించారు. రాజేష్ గౌడ్ గారి ఆధ్వర్యంలో గంగుల సమక్షంలో పార్టీలో చేరిన వారిని గంగుల ప్రభాకర్ రెడ్డి గారు గంగుల బిజేంద్రారెడ్డి గారు ప్రేమపూర్వకంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పి వైసీపీ తీర్థం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండదండగా నిలుస్తుందని తెలియజేశారు. మహదేవపురం గ్రామం నుండి 30 వాహనాలలో సుమారు 200 మందికి పైగా ప్రజలు తరలి రావడం వల్ల మార్గమధ్యంలో ఎటువంటి అవాంతరాలు ఆటంకం ఎదురుకాకుండా కెమెరాల మధ్య ఆళ్లగడ్డకు చేరుకున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపికన్వీనర్ ఇందూరిప్రతాప్ రెడ్డి, జిల్లా వైసీపీ వైస్ ప్రెసిడెంట్.అబ్దుల్ సలాం, ఎంపీపీ . నాయక్ మహమ్మద్ వసీం, మందాల శివారెడ్డి, జింకల నాగన్న, గుండంపాడు ప్రతాపరెడ్డి, కొట్టే జయ లక్ష్మమ్మ , పిక్కిలి నరహరి, మహాదేవ పురం ,గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా దామెర్ల జయంతి




నంద్యాల ప్రతినిధి. మార్చి 08. (నంది పత్రిక ):ప్రసిద్ధ చిత్రకారులు దామెర్ల రామారావు 130 వ జయంతిని పురస్కరించుకొని న్యూ పెయింటింగ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దామెర్ల రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ చిత్ర కారులు కోటేష్, ప్రెసిడెంట్ ధనరాజ్ మాట్లాడుతూ దామెర్ల రామారావు చిత్ర కళా వైతాళికుడని చిత్ర కళలో ఆయన సైలి చాలా అద్భుతంగా ఉంటుందని ఆయన ఎన్నో వేల స్కెచ్ లు,కాన్వాస్ పై దేవత మూర్తుల చిత్రాలు, పల్లె జీవన సైలి చిత్రాలు ఎంతో రమణీయంగా వుంటాయని, రాజమండ్రి లో ఆయన పేరిట ఆర్ట్ గ్యాలరీ ఉందని తెలిపారు. ఆ మహనీయుని తలచుకుంటూ ఆయన జయంతికి నివాళులు అర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ చిత్ర కారులు రాముడు, వాసు, శ్రీను (విజయ్ ఆర్ట్ )వైస్ ప్రెసిడెంట్ నరసింహ, సెక్రటరీ రాజా రామ్, (సుంకన్న )జాయింట్ సెక్రటరీ సీతారాం, ట్రెజరర్ తరుణ్, ఓబులేసు, ఆనంద్, మన్సుర్ తదితరులు పాల్గొన్నారు.

# విమానంలో బీడీ తాగాడు... ప్రయాణికుడిపై కేసు

విమాన ప్రయాణాల్లో కఠినమైన భద్రతా నిబంధనలు ఉన్నప్పటికీ, కొందరు ప్రయాణికులు వాటిని అతిక్రమిస్తూనే ఉన్నారు. తాజాగా ఢిల్లీ నుంచి గోవా వెళుతున్న ఆకాశ ఎయిర్ విమానంలో ఓ ప్రయాణికుడు ఏకంగా టాయిలెట్‌లో బీడీ కాల్చి పోలీసులకు దొరికిపోయాడు. ఈ ఘటన శనివారం జరగగా, దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు ఆదివారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీకి చెందిన ఆశీష్ అనే వ్యక్తి ఆకాశ ఎయిర్ విమానంలో ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

## చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన



**నంద్యాల ప్రతినిధి. మార్చి 08 . (నంది పత్రిక ):**అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్వర్గీయ జాతీయ అవార్డు గ్రహీత యం. ఆర్. గోవింద రెడ్డి మరియు స్వర్గీయ ఆర్. సి. కంభగిరి రాజు చిత్రకళలో చేసిన సేవలకు జ్ఞాపకార్థం 11 వ జిల్లా స్థాయి చిత్ర లేఖన పోటీలు పోటీలు ప్రముఖ చిత్రకారులు చిత్తులూరి రామ్ ప్రసాద్, చింతలపల్లె కోటేష్ ఆధ్వర్యంలో నంద్యాల లోని రామకృష్ణ డిగ్రీ కళాశాల లోని వివేకానంద ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుండి మద్యాహ్నం 1 గంటల ఘనంగా జరిగాయి. దాదాపు 180 మంది పైగా విద్యార్థులు పాల్గొని స్వర్గీయ "భారతరత్న" సంగీత విద్యాంసురాలు యం.ఎస్. సుబ్బలక్ష్మి చిత్రాన్ని అద్భుతంగా వేశారు. ఈ కార్యక్రమం లో చిత్ర కళ లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ చిత్రకారులు సి. యం. శ్రీనువాసులు (విజయ్ ఆర్ట్ )కి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్బంగా ప్రముఖ చిత్రకారులు చిత్తులూరి రామ్ ప్రసాద్, కోటేష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు చిత్ర కళలో కూడా రాణించాలి. మీలో వున్నా సృజనాత్మకత వెలుగు లోకి రావాలి. ఈరోజు మహిళా దినోత్సవం సందర్బంగా భారతరత్న, సంగీత విద్యాంసు రాలు ఎం. స్. సుబ్బలక్ష్మి చిత్రాలను అద్భుతమైన రీతిలో వేశారు. పాలొగొన్న విద్యార్థులకు, విజేతలకు అభినందనలు తెలిపారు. అనంతరం వారు విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధమ బహుమతి 1 గ్రాము ప్యూర్ బంగారం యల్. విరాట్, ద్వితీయ బహుమతి 15 గ్రాముల వెండి పతకం కె. గణేష్, తృతీయ 10 గ్రాముల వెండి పతకం ఆర్. రోహిత్ సాధించారు. అలాగే స్పెషల్ జ్యూరి అవార్డు కింద ప్రత్యేక పది మందికి బహుమతులు అందుకున్న వారిలో రాగ చైత్ర, కోమలేష్, దీప్తి, అఫ్రిద్, శ్రేష్ట, షణ్మికి వాసవి, క్షీరజ రెడ్డి, దత్త నరసింహ, దుర్గ, నిత్య శ్రీ సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు ప్రభాకర్, రామిరెడ్డి రెడ్డి, ప్రముఖ చిత్ర కారులు, రంగనాథ్,వెంకటేశ్వర రాజు, రాముడు, వాసు, ధనరాజ్,సుంకన్న, ఓబులేసు,సీతారాం, తరుణ్,ఆనంద్ పాల్గొన్నారు.



## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**నంద్యాల ప్రతినిధి. మార్చి 08 . (నంది పత్రిక ):**ప్రజా రోడ్డు రవాణా సంస్థ నంద్యాల జిల్లా కి సంబంధించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నంద్యాల డిపో నందు నిర్వహించారు. ఈ వేడుకలు డిపిటిఓ నంద్యాల రజియా సుల్తానా ఆధ్వర్యంలో డిపో మేనేజర్ మాధవీలత సహకారంతో నిర్వహించడం జరుగుతుంది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ లక్ష్మీ సౌజన్య గైనకాలజిస్ట్ , అడ్వకేట్ తోట నిర్మల , డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ లక్ష్మీ దేవిని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమముకి నంద్యాల జిల్లా లోని అన్ని డిపోల నుండి మహిళా ఉద్యోగస్తులు అందరు హాజరవటమైనది. వీరిలో జిల్లా మొత్తం సంబంధించి ఐదు మంది ఉత్తమ మహిళా ఉద్యోగస్తులను ఎన్నిక చేసి వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరిగింది.



## దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా స్వాతి వేడుకలు.





**రుద్రవరం ప్రతినిధి మార్చి 8 (నంది పత్రిక):** మండల కేంద్రం రుద్రవరం సమీపంలో ఉన్న నల్లమల్ల అటవీ ప్రాంతంలో వెలసిన దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి లక్ష్మీనరసింహులు స్వాతి నక్షత్ర వేడుకల సందర్భంగా స్వామివారికి అభిషేక పుష్పాలంకరణ నైవేద్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలకు భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. స్వాతి నక్షత్ర వేడుకలకు హాజరైన భక్తులకు ఆలయ నిర్వహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు. స్వాతి నక్షత్ర వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఆలయ నిర్వహకులు వసతులు కల్పించారు.

# 'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి ..

### ఎంఈఓ చిన్న మద్దిలేటి

**జూపాడుబంగ్లా :మార్చి :8: (నంది పత్రిక)** జూపాడుబంగ్లా మండలంలోని పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ చిన్న మద్దిలేటి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు, ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రణాళికలు, విద్యార్థులు ఎలా చదవాలో, పరీక్షలు ఎలా రాయాలో, విద్యార్థులకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో దిశ నిర్దేశం చేసినట్టు తెలిపారు. 'నంది పత్రికకు' ఇచ్చిన ఇంటర్వ్యూ అంశాలు తెలియజేశారు. **ప్రశ్న:-** పది పరీక్షలకు ఎన్ని సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు? **జవాబు:-** ఈ నెల 16వ తేదీ నుండి వచ్చేనెల ఒకటో తేదీ వరకు జరుగునున్న పదవ తరగతి పరీక్షలకు రెండు రెండు సెంటర్లను ఏర్పాటు చేశాము. ఉదయం 9:30 నుండి 12:45 వరకు పరీక్షలు జరుగుతాయి.

**ప్రశ్న:-** ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు? **జవాబు:-** మండల వ్యాప్తంగా మొత్తం విద్యార్థులు479 మంది విద్యార్థులు పరీక్షలు రాయచున్నారు.





**ప్రశ్న:-** పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

**జవాబు:-** పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు, 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. తాగునీరు,వైద్య సదుపాయాలతో పాటు విద్యుత్ సరఫరా ఉండేలా ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. బస్సులను విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించాము.

**ప్రశ్న:-** జిరాక్స్ సెంటర్ల మూసివేత?

**జవాబు:-** పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని పోలీసు శాఖకు తెలియజేశాము. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

**ప్రశ్న:-** ఉత్తమ ఫలితాలు సాధన ఎలాంటి చర్యలు?

**జవాబు:-** మండల వ్యాప్తంగా 10వ తరగతి ఫలితాలలో మెరుగైన ఉత్తీర్ణత సాధనకు వందరోజుల ప్రణాళికలో భాగంగా 84 రోజులు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరిగింది.

**ప్రశ్న:-**విద్యార్థులకు సూచనలు?

**జవాబు:-** విద్యార్థులు టీవీలు సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పరీక్ష సెంటర్లకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలి. విద్యార్థులకు సెంటర్లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసాము. ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

**ప్రశ్న:-** పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా?

**జవాబు:-** ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేకంగా నిఘా ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు ఎలా రాస్తున్నారనినే విషయం జిల్లాఅధికారులు నిరంతరం పర్యవేక్షించను న్నారు.

# మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి







**- మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**-ప్రతి రంగంలో మహిళలకు సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం**

**- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**

**నంద్యాల, మార్చి 08. నంది పత్రిక:**మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావడమే సమాజ పురోగతికి పునాది అని జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. విద్య లేనివాడు ప్రపంచంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేడని, ప్రతి కుటుంబం పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల చదువును ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతిలో చాలా మంది మహిళలే ఉన్నారని ఆయన తెలిపారు. వివాహం అయిన తర్వాత కూడా పిల్లలను చూసుకుంటూ చదువు కొనసాగిస్తూ పరీక్షలకు హాజరవుతున్న మహిళల పట్టుదల అభినందనీయం అన్నారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ పరీక్షలను మళ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ప్రారంభం కావడం వల్ల యువతకు మంచి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో మహిళలు అధిక శాతం ఉండటం మహిళల చైతన్యాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు.ప్రస్తుతం దేశంలో జనన రేటు తగ్గిపోతున్న నేపథ్యంలో మానవ వనరుల అభివృద్ధి ఎంతో కీలకమని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. యువత సంఖ్య పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, సమతుల్య జనాభా దేశ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందిస్తోందని ఆయన తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను నిలబెట్టడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఒక ముస్లిం మహిళ తన కృషితో సంవత్సరానికి దాదాపు రూ.36 లక్షల ఆదాయం సంపాదిస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉదాహరణను మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి మహిళలు సమాజానికి ప్రేరణగా నిలుస్తారని, వారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆడపిల్లల వివాహాల కోసం 'షాదీ ముబారక్' వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగం సహా అనేక ఉపాధి రంగాల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒక ఇంటి నిర్మాణంలోనే అనేక రకాల పనులు ఉంటాయని, వాటిని నేర్చుకుంటే స్థానిక యువతకు మంచి ఆదాయం లభిస్తుందని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

మహిళల పురోగతే నిజమైన అభివృద్ధి - రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళలందరికీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన చారిత్రక నిర్ణయం తీసుకున్న నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన గుర్తు చేశారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. లిమహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా మహిళలకు ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మహిళలు వ్యవసాయం, వ్యాపారం, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదుగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.

అంతకుముందు మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి లీలావతి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకట దాసు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.







# సమాజం అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**-ఏరియా వైద్యశాల పర్యవేక్షకులు సతీమణి షేక్ సల్మా ఆదం,గైనకాలజిస్ట్ డాక్టర్ జయమ్మ**

**గిద్దలూరు,మార్చి 8 . నంది పత్రిక:**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గిద్దలూరు పట్టణంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గర్ల్స్ హైస్కూల్ లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల పర్యవేక్షకులు సతీమణి షేక్ సల్మా ఆదం,గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల గైనకాలజిస్ట్ డాక్టర్ జయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కుటుంబ నిర్మాణం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు సమాన హక్కులు,గౌరవం మరియు అవకాశాలు కల్పించేందుకు కేంద్రంలో,రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వారు వివరించారు.మహిళల ఆర్థిక స్వావలంబన,విద్యా అభివృద్ధి మరియు భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మహిళలు విద్య, ఉపాధి,రాజకీయ రంగాల్లో ముందుకు వచ్చి సమాజ అభివృద్ధికి మరింతగా తోడ్పడాలని వారు పిలుపునిచ్చారు.మహిళల శక్తి దేశ అభివృద్ధికి ప్రధాన బలమని,మహిళల సాధికారతే దేశ పురోగతికి మార్గమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు మహిళా ఉపాధ్యాయులు,స్థానిక ప్రజాప్రతినిధులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలలకు సమానత్వపు హక్కు కల్పించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు దే






## ఎమ్మెల్యే గిత్త జయసూర్య. ఘనంగా అంతర్జాతీయ మహిళల దినోత్సవం.

నందికొట్కూరు మర్చి 8(నంది పత్రిక ) మహిళలు అన్ని రంగాలలో రాణించేలా మహిళల సాధికార తే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు తన పరిపాలనలో మహిళలకు సమాన హక్కులు కల్పించి మహిళలను చైతన్యవంతులు చేసిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు కే దక్కుతుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నందికొట్కూరు పట్టణ సమీపంలోని చాముండి ఫంక్షన్ హాల్ నందు పొదుపు లక్ష్మి మహిళలు మరియు అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్త జయ సూర్య తన సతీమణితో హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మహిళా దినోత్సవ వేడుకలను ఉద్దేశించి మాట్లాడుతూ నాడు ఆంధ్ర రాష్ట్రంలో మహిళలకు అధిక ప్రాధాన్యతిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో మహిళల సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆదర్శవంతంగా నేటి సమాజంలో నిలుస్తున్నారని, కుటుంబంలో మహిళ ప్రాధాన్యత ఎంతో ఉందని, కుటుంబ అభివృద్ధిలోనూ ఆమె శ్రమ చాలా కీలకమైనదని, పొదుపు సంఘంలో ఉంటూ ఎలాంటి ఆర్థిక ఒడిదుదూకులకు ఇబ్బంది లేకుండా గౌరవంగా జీవిస్తున్నారని అలాంటి అవకాశాన్ని కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడు కే దక్కుతుందని కొనియాడారు. దేశంలో ఎంతోమంది మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, దేశ గౌరవాన్ని నిలపడంలో కూడా మహిళల పాత్ర చాలా ఉందని, అలాంటి మహిళలను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా అన్ని రంగాల్లో రాణించాలని ఆయన మహిళలకు సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎమ్మెల్యే గిత్త జయసూర్య తన సతీమణితో కలిసి సన్మానించారు. స్వయం సహాయక సంఘాల ప్రగతికి శ్రీనిధి, సిఐఎఫ్ స్కీముల నుండి 25, 889 సంఘం సభ్యులకు మంజూరైన రుణాల 2,66,85,00,000 చెక్కును పొదుపు సంఘాల మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ మంగవలి, టిడిపి సీనియర్ నాయకులు మండ్రా సురేంద్ర నాథ్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షురాలు మీనాక్షి దేవి, డాక్టర్ వనజ, అనురాధ, లాయర్ జాకీర్ హుస్సేన్, సిపిఐ ఎమ్ యల్ నాయకులు లిజరేషన్ నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు, పగిడాల టిడిపి మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల స్వాములు, టిడిపి నాయకులు సగినేలా వెంకటరమణ మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం

కర్నూలు నంది పత్రిక.... ఉదయం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ మీటింగ్ హాల్ లో ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించినారు. ఈ కార్యక్రమములో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడరు. స్త్రీ లేకపోతే జననంలేదు, స్త్రీ లేకపోతే గమనం లేదు, స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదు అమ్మను గౌరవించు, భార్యను ప్రేమించు, సోదరిని దీవించు, మహిళలను గౌరవించాలని తెలిపారు. కంటికి పాపలా కాపాడే స్త్రీమూర్తికి అంతర్జాతీయ శు భాకాంక్షలు తెలిపారు. మహిళలు ప్రస్తుతం సమాజంలో అన్నీ రంగాల్లో రాణిస్తున్నారని విద్యా,వైద్య వ్యాపారాలు,క్రీడలు, రాజకీయాలు , అంతరిక్షం, టెక్నాలజీతో పాటు ఇంటి భాద్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్దపెట్టి అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు,కళాశాలల్లో విద్యార్థులకు సంపూర్ణ పోషకాహారం అందిస్తూ రక్త హీనత నివారించే చర్యలు తీసుకుందని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే అన్నివిధాల దేన్నైనా సాధించగలరని, పోషకాహారం తీసుకోవడంతో పాటు రోజుకు కనీసం 30 నిమిషాలు నడవడం చేయడం ద్వారా రక్తపోటు, షుగర్ లాంటి జబ్బులు దరిచేరవని తెలిపారు. మహిళలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని, 35 సంవత్సరములు దాటిన మహిళలు పాప్ స్మియర్, మమ్మోగ్రఫీ పరీక్షలు చేయించుకోవాలని సూచించినారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.భాస్కర్ పరిపాలన అధికారిని అరుణ ,వ్యాధినిరోధక టీకాల అధికారిణి డాక్టర్.ఉమా ,డాక్టర్.మంజుశ ,డిప్యూటి డెమో షఫీ ఉన్నిస మరియు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్.కార్తిక లక్ష్మి ని శాలువా,పూల దండలతో సత్కరించినారు. ఈ కార్యక్రమములో మహిళా ఉద్యోగులు మరియు ప్రోజేక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.





## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు.

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.

కర్నూలు నంది పత్రిక..... కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారి ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.





## పరీక్షలకు సన్నద్ధం అవ్వండి

### - యం ఇ ఓ నాగరాజు

కొత్తపల్లి - నంది పత్రిక : ఈనెల 16 వ తేదినుంచి పదవతరగతి పరీక్షలు మొదలౌతాయని పరీక్షలకు అందరూ విద్యార్థులు సన్నద్ధం కావాలని ఎంఈఓ నాగరాజు సూచించారు. ఆదివారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నందు జరుగుతున్న వందరోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు వారంరోజుల్లో మొదలు అవుతయాని విద్యార్థులు ప్రతి సబ్జెక్టును టైంటేబుల్ వేసుకొని శ్రద్ధగా చదవాలన్నారు. ప్రతి ఒక్కరు మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులకు అర్థం అవ్వని సజ్జేలను అర్థవంతమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలన్నారు. ఉత్తీర్ణత సాధించే దిశగా సిద్ధం చేయ్యాలన్నారు. విద్యార్థులకు సమస్య ఏదైనా ఉంటే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. అర్థం కాని వాటిని నివృతిచేసుకోవాలన్నారు.



## ఆడపిల్లల హత్యలు మహా పాపం

### మహిళల ఉన్నత విద్యతోనే సామాజిక మార్పు

### మాజీ జడ్పిటిసి యామ గురప్ప






శిరివెళ్ళ:(నంది పత్రిక) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శిరివెళ్ళలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ , కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ ఓ మహిళలకు ఘనంగా సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత , మాజీ జడ్పిటిసి యామ గురప్ప హాజరై మహిళలను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. అనంతరం సమాజ సేవలో ముందుంటున్న ఆశా కార్యకర్తలకు , పారిశుద్ధ్య కార్మికులకు , అంగన్వాడీ లకు మరియు వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులకు సొంత ఖర్చుతో చీరలు పంపిణీ చేసి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి యామ గురప్ప మాట్లాడుతూ... సమాజంలో మహిళలు సగం జనాభా ఉన్నప్పటికీ , వేలాది సంవత్సరాలుగా వారు అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలను పుట్టకముందే చంపేయడం అత్యంత హేయమైన చర్య అని , ఇది మహా పాపమని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. బాల్య వివాహాల దుష్పరిణామాలను వివరిస్తూ , 13, 14 ఏళ్లకే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం వల్ల వారు శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఆడపిల్లల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని , వారి చదువును కేవలం పదో తరగతితో ఆపేయకుండా తప్పనిసరిగా డిగ్రీ , పీజీ వరకు ఉన్నత విద్యను అందించాలని ఆయన పిలుపునిచ్చారు.సమాజంలో పాతుకుపోయిన మగ అహంకారం వలనే మహిళలు చిన్నచూపుకు గురవుతున్నారని ఆయన విమర్శించారు. మహిళలకు సమాన గౌరవం , అవకాశాలు లభించినప్పుడే సమాజం , దేశం ముందుకు వెళుతుందని ఆయన ఉద్ఘాటించారు.నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరీ , ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియమహిళలే అని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ ధైర్యంగా అన్ని రంగాల్లో ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మహిళా సిబ్బంది , మరియు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## సెలవు రోజు ఇంటి పన్ను వసూళ్లు



బండి ఆత్మకూరు నంది పత్రిక మార్చి 8 : ఉన్నతాధికారులు ఒక లక్ష్యం అంటూ నిర్దేశించాక లక్ష్యాన్ని చేరుకునే వరకు శ్రమించాల్సిందే. ఆదివారం నాడు ఓ పంచాయతీ కార్యదర్శి సెలవు దినం నాడు కూడా పన్ను వసూళ్లకు పూనుకున్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్లపాడు గ్రామంలో దాదాపు లక్ష 16 వేల రూపాయలు ఇంటి పన్నుకు సంబంధించి లక్ష్యం ఉంది. ఇప్పటికే 70 శాతం పన్ను వసూలు అయినప్పటికీ మార్చి 15 నాటికి వంద శాతం పన్ను వసూలు చేసి తీరాల్సిందేనంటూ అధికారులు ఆంక్షలు విధించారు. ఆంక్షలు విధించాక తప్పుతుందా అంటూ కార్యదర్శి పన్నువసూళ్ల లో పడి మునిగి తేలుతున్నారు. పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి శ్రీకాంత్ ఈర్నపాడు గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శి కాదు. సోమ యాజుల పల్లె పంచాయతీ కార్యదర్శిగా ఉన్న శ్రీకాంత్ ను ఈర్నపాడు గ్రామ పంచాయతీకి ఇంచార్జి కార్యదర్శిగా నాలుగు నెలల క్రితం అధికారులు అదనపు బాధ్యతలను అప్పగించారు. రెగ్యులర్ పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లు, బిపిఎల్ సర్వేలతోపాటు, ఇన్చార్జి గ్రామంలో కూడా పన్ను వసూళ్ల లో పడి తల మునకలు అవుతూ ఉన్నారు. తనను ఇన్చార్జి నుండి తప్పించండి మహాప్రభో! అని అధికారులకు వేడుకుంటున్నప్పటికీ కని కరించడం లేదు. ఏదో సర్దుకుపోవాలి అంటూ అధికారులు ఉచిత సలహా మాత్రం పడేస్తున్నారు.

## మానసిక ఉల్లాసానికి హ్యాపీ సండే

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు నంది పత్రిక... ప్రజలు తమ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, ఆనందంగా గడపడం, ఆరోగ్యంగా ఉండడం కోసమే ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. ఆదివారం బిర్లా కాంపౌండ్‌లోని ఖానా–ఖజానాలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులు స్టెప్పులు వేశారు. చిన్నారులు యోగా ఆసనాలు వేశారు. మను, శ్రీ,కృష్ణ ప్రియ, సాత్వికులు చేసిన అడ్వాన్స్ యోగ వ్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రతిరోజూ పనుల ఒత్తిడిలో ఉంటారని, అలాంటి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో కలిసి కొంత సమయం ఉల్లాసంగా గడపడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని అన్నారు. హ్యాపీ సండే వంటి కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, డిఈఈ నరేష్, శానిటేషన్ ఇంస్పెక్టర్ రాజు, సిబ్బంది శ్రీదేవి, శోభారాణి, కావ్య, పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌లో మహిళ ఉద్యోగులకు సమాన అవకాశాలు

### తొలిసారి ఆర్వో, శానిటేషన్ ఇంస్పెక్టర్లుగా అవకాశం

### ప్రశంసా కార్యక్రమాల్లో సైతం ప్రాధాన్యం

### నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు నంది పత్రిక..... నగరపాలక సంస్థలో మహిళలు అన్నింట్లో రాణించాలనే ఉద్దేశంతో మహిళా ఉద్యోగులపై ప్రత్యేక శ్రద్ధతో సమాన అవకాశాలు కల్పిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం ఖానా ఖజానా వద్ద ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలచే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను సత్కరించారు.కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, షబానా, సచివాలయ విభాగంలో ఉమెన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కావ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎంజల్, పార్కుల విభాగంలో తెలుగు రుక్మిణి, పారిశుద్ధ్య కార్మిక విభాగంలో నాగేంద్రమ్మ, వెంకటేశ్వరమ్మల సేవలను కమిషనర్ ప్రశంసించి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో మొట్టమొదటి సారిగా ఒక మహిళకు రెవెన్యూ అధికారిగా, మరో మహిళను శానిటేషన్ విభాగంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా అవకాశాలు కల్పించినట్లు వివరించారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ ధ్యేయమని తెలిపారు. ప్రశంసా పత్రాలతో పాటు అన్ని సందర్భాల్లోనూ మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో అన్ని విభాగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ఆర్వో స్వర్ణలత, శానిటేషన్ ఇంస్పెక్టర్ ఎంజల్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ చరిత్రలో తొలిసారి మహిళలను రెవెన్యూ అధికారి, శానిటేషన్ ఇంస్పెక్టర్‌గా నియమించి, మహిళలకు సమాన అవకాశాలు ఇచ్చిన కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తాము ఆ స్థానాల్లో మొదటగా ఎంపికవ్వడం ఆనందంగా అనిపించిందన్నారు. నిజమైన మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్వో స్వర్ణలత, డీఈఈ నరేష్, సిబ్బంది శోభారాణి, శానిటేషన్ ఇంస్పెక్టర్ రాజు, ఎంజల్, పాల్గొన్నారు.



# సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి





## ప్రాంగణం, హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, మార్చి 08(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్త బురుజు గ్రామంలో ఈ నెల 9వ తేదీన జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. పర్యటన సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమం విజయవంతంగా జరిగేలా చేపడుతున్న ఏర్పాట్లను ఆమె వివిధ కోణాల్లో సమీక్షిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు.

**సభా ప్రాంగణం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి** కార్యక్రమం నిర్వహించనున్న సభా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి విస్తీర్ణం, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, నీడ కోసం షెడ్లు ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యే రైతులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**హెలిప్యాడ్ పనుల పరిశీలన** ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా హెలిప్యాడ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. హెలిప్యాడ్ వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు ఫైర్ సేఫ్టీ చర్యలు, అత్యవసర పరిస్థితులకు అంబులెన్స్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

**రవాణా, ట్రాఫిక్ నిర్వహణపై సూచనలు** కార్యక్రమం జరిగే ప్రదేశానికి చేరుకునే రహదారులను మరమ్మతులు చేసి రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ముందస్తు ప్రణాళిక రూపొందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి** కార్యక్రమానికి విచ్చేసే ప్రజలకు తాగునీరు, పార్కింగ్ స్థలాలు, శానిటేషన్ సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**రైతులతో ఆత్మీయంగా ముచ్చటించిన కలెక్టర్** ఈ సందర్భంగా రైతులతో జిల్లా కలెక్టర్ ఆత్మీయంగా ముచ్చటించి వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఉన్నతాధికారుల సమీక్ష** ఈ పరిశీలనలో రాష్ట్ర భూసర్వే మరియు భూవ్యవస్థాపన శాఖ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ మరియు స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీమతి జి. జయలక్ష్మి, అదనపు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ శ్రీ జె. వెంకట మురళి పాల్గొని కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.

**సమన్వయంతో పని చేయాలి** ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే సమగ్రంగా ప్రణాళిక రూపొందించి ఎలాంటి లోపాలు లేకుండా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను కచ్చితంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, పోలీసు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో , మార్చి, 08(నంది పత్రిక):-** నేడు (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్‌లో కూడా సమర్పించవచ్చన్నారు. అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి



**నందిపత్రిక –డోన్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు నంద్యాల జిల్లా డోన్ మండలంలోని కొత్తబురుజు గ్రామంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, ప్రముఖ నాయకులు గౌరు వెంకటరెడ్డి అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు.

**క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన** ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కొత్తబురుజు గ్రామంలో సీఎం హెలికాప్టర్ దిగేందుకు సిద్ధం చేసిన స్థలాన్ని, భద్రతా చర్యలను అధికారులతో చర్చించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా సీటింగ్, మంచినీరు, ఇతర సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. జన సమీకరణలోను, ఏర్పాట్లలోను ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**నంద్యాల క్రైం, మార్చి 08(నంది పత్రిక):-** నంద్యాల పట్టణం నూనెపల్లె బొగ్గులైన్ రోడ్డు నందు జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన కామిరెడ్డి రాజ ఇమ్మనియేల్ విన్సన్ చర్చిల్ (62) ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా వేగంగా దూసుకెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనగా ద్విచక్ర వాహనం పై వెళ్తున్న ఇద్దరిలో ఒకరైన కామిరెడ్డి రాజ ఇమ్మనియేల్ విన్సన్ చర్చిల్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పట్టణంలోని సెయింట్ లూక్స్ అంధుల పాఠశాలలో ఫీల్డ్ ఆఫీసర్ గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. నూనెపల్లె బొగ్గులైన్ రోడ్డు నందు అనేక రోడ్డు ప్రమాద ఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# మహిళల రక్షణకు వన్ స్టాప్ సెంటర్ సేవలు





## బాధిత మహిళలకు ఒకే చోట అన్ని సహాయాలు.
## ఆదోని లో వన్ స్టాప్ సెంటర్ ప్రారంభం.
## ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్.

**కర్నూలు నంది పత్రిక.....** ఆదోని పరిసర ప్రాంతాల్లో మహిళలపై జరుగుతున్న హింసాత్మక ఘటనలకు గురైన బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు వన్ స్టాప్ ద్వారా సమగ్ర సేవలు అందించబడుతున్నాయి. కుటుంబంలో, సమాజంలో, కార్యాలయాల్లో లేదా ఇతర ప్రజా మరియు వ్యక్తిగత ప్రదేశాల్లో హింసకు గురైన మహిళలకు ఒకే చోట అవసరమైన సహాయం అందించడమే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశం అని ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆదోని ప్రభుత్వం జనరల్ హాస్పిటల్ లో శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి అనంతరం అధికారులతో కలిసి మహిళలకు అత్యవసర సహాయం అందించే ఉమెన్ హెల్ప్ లైన్ -- 181 మరియు పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చైల్డ్ హెల్ప్ లైన్ -- 1098 సేవలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ...వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలపై జరిగే అన్ని రకాల హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు తక్షణ, అత్యవసర మరియు ఇతర అవసరమైన సేవలు అందుబాటులో ఉంచబడతాయని తెలిపారు . ఈ కేంద్రం ద్వారా అత్యవసర స్పందన మరియు రక్షణ సేవలు, వైద్య సహాయం, మహిళలునమోదు చేయడంలో సహాయం, మానసిక–సామాజిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం, అవసరమైన వారికి ఆశ్రయం, అలాగే వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యం వంటి సేవలు అందించబడుతున్నాయి. వన్ స్టాప్ సెంటర్ సేవలు 18 సంవత్సరాల లోపు బాలికలు సహా అన్ని మహిళలకు అందుబాటులో ఉంటాయి. కులం, మతం, వర్గం, ప్రాంతం, లైంగిక అభిరుచి లేదా వివాహ స్థితి వంటి భేదాలు లేకుండా హింసకు గురైన మహిళలు ఈ సేవలను పొందవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ.. మాట్లాడుతూ, కర్నూలు జిల్లాలో రెండవ వన్ స్టాప్ సెంటర్ ను ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే మొదటి వన్ స్టాప్ సెంటర్ కర్నూలులో పనిచేస్తున్నదని పేర్కొన్నారు. ఈ సెంటర్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం 0 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల హింసకు గురైన మహిళలకు పునరావాసం, న్యాయ సహాయం, వైద్య సేవలు, పోలీసు సహాయం వంటి అన్ని అవసరమైన సేవలను ఒకే చోట అందించడం అని వివరించారు. బాధిత మహిళలకు తక్షణ సహాయం అందించి వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం కల్పించే విధంగా ఈ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఈ సదుపాయాలపై సమాజంలో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే హింసకు గురైన మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని, పిల్లలకు సంబంధించిన సమస్యల కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కు సంప్రదిస్తే సంబంధిత సిబ్బంది వారి వద్దకు చేరుకుని అవసరమైన వైద్య మరియు ఇతర సహాయ సేవలు అందిస్తారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 10 వన్ స్టాప్ కేంద్రాలను ప్రారంభించారు. అందులో కర్నూలు జిల్లా ఆదోని లో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ కూడా ఒకటిగా ప్రారంభించబడింది. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సంక్షేమం మరియు భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఇచ్చిన సందేశాన్ని ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) వారి ఆధ్వర్యంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు అత్యవసర సహాయం, న్యాయ సహాయం, వైద్య సేవలు, కౌన్సెలింగ్ వంటి సేవలను ఒకే కేంద్రం ద్వారా అందించడమే వన్ స్టాప్ సెంటర్ ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఢిల్లీశ్వరి, హాస్పిటల్స్ సూపర్డెంట్ యం. నాగరాజు శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్టార్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**నంద్యాల ప్రతినిధి. మార్చి 08 . (నంది పత్రిక ):** నంద్యాల పట్టణం వైయస్సార్ నగర్ లో ఉన్న స్టార్ సొసైటీ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం అత్యంత వైభవముగా స్టార్ సొసైటీ వారు నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యురాలు ఎరుకల రాజేశ్వరమ్మ పాల్గొని ముందుగా కేక్ కట్ చేసి,వివిధ రంగాలలో సేవలందించిన మహిళలను సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృష్టికి మూలం మహిళ, శక్తికి రూపం మహిళ. ఒక అమ్మగా ప్రేమను, భార్యగా తోడును, సోదరిగా అనురాగాన్ని పంచడమే కాకుండా, నేడు ప్రతి రంగంలోనూ, తనదైన ముద్ర వేస్తూ, సమాజ గవనాన్ని మారుస్తుంది. ఓర్పులో భూదేవిని, ధైర్యంలో ఆదిశక్తిని తలపించే ప్రతి మహిళా మూర్తికి నా హృదయపూర్వక కృతజ్ఞతలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది మహిళలను శాలవాలతో, చీరలతో, స్వీట్స్ గాజులు పండ్లతో సత్కరించడమైనది. సత్కరించబడిన మహిళలు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మాంత్రి కమిటీ సభ్యురాలు అంబడిపూడి చిన్నమ్మ, ఎన్ ఎస్ సి బి ఏ వి నాగలక్ష్మి, దళిత వెల్ఫేర్ అసోసియేషన్ భాగ్యమ్మ, చిన్నారి, ఆరోగ్య కార్యకర్త పి వెంకటలక్ష్మి, హుస్సేన్ బి, సాంప్రజిక కార్యకర్త లక్ష్మీదేవి, శారద, కమలబి, తదితరులను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు వేసిన డాన్స్ లు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్టార్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గడ్డం సుబ్బరాయుడు, దళిత వెల్ఫేర్ అసోసియేషన్ సామేలు, రవిబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





# అనుమానాస్పదంగా వివాహిత మృతి...

## భర్త పరారీ, కుటుంబ సభ్యులపై బంధువుల ఆరోపణలు

**పోరుమామిళ్ల మార్చి 8 (నంది పత్రిక ):** కడప జిల్లా పోరుమామిళ్ల మండలం తిరువెంగలాపురం గ్రామంలో సుజాత అనే వివాహిత అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

మృతురాలి బంధువులు మాత్రం ఆమెను భర్త గురుశేఖర్ మరియు అత్తమామలే హత్య చేశారని ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పరిశీలించినప్పుడు మెడపై గాయం కనిపించడం, ఘటన అనంతరం భర్త గురుశేఖర్ పరారీలో ఉండటం అనుమానాలకు తావిస్తోంది.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు.



## నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షునికి మాజీ మంత్రి బుగ్గన పరామర్శ



బేతంచెర్ల మార్చి 8 ( నందిపత్రిక ). మాజీ ఆర్థిక శాఖ మంత్రి లిబుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం నాడు ఇటీవల నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్‌లికు శస్త్ర చికిత్స జరిగినందువలనవారి నివాసానికి వెళ్ళిపరామర్శించారు. వారితో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు , ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ,మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్ , మండల అధ్యక్షులు సోమేష్ యాదవ్ ,పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి ,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రుడు ,పార్టీ నాయకులు ఆర్.ఇ రాజవర్ధన్ ,పాలుట్ల రఘురామ్ ,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు సుబ్బారాయుని సన్నిధిలో తెలంగాణ నిజామాబాద్ జూనియర్ సివిల్ న్యాయమూర్తులు..!



ఎస్.కొత్తూరు. నంది పత్రిక:ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానమును తెలంగాణ రాష్ట్రము నిజామాబాద్ జిల్లా, జూనియర్ సివిల్ జడ్జీలు హరికుమార్, సతీమణి జడ్జి చైతన్యలు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో యం.రామక్రిష్ణ అర్చకులు సురేష్ శర్మ, నారాయణ శర్మ, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు, పలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు పూలమాలలు, శాలువాలు, శేష వస్త్రముతో ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదము, స్వామివారి చిత్రపటమును అందజేశారు. ఈ కార్యక్రమంలోఆలయసిబ్బంది సుబ్బారెడ్డి,నాగేశ్వరరావు, జడ్జిలబంధుమిత్రులు పాల్గొన్నారు.



## కర్నూలు గౌరవ అధ్యక్షులుగా సబ్ రిజిస్టర్ శ్రీనివాసరావు.



కర్నూలు నంది పత్రిక.... కర్నూలు నంద్యాల జిల్లా సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఎన్నికలు రాష్ట్ర పరిశీలక్కడు సుబ్రహ్మణ్యం ,మహబూబ్ బాషా సబ్ రిజిస్టర్, అబ్దుల్ ఫిరోజ్ ఓర్వకల్లు సబ్ రిజిస్టర్ ఆధ్వర్యంలో రెండు జిల్లాలలో ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. కర్నూల్ సబ్ రిజిస్టర్ శ్రీనివాసరావును గౌరవాధ్యక్షులుగా నియమించడం జరిగిందని తెలియజేశారు. కర్నూలు జిల్లా అధ్యక్షులుగా మురళి సుందర్రావు, ఉపాధ్యక్షులుగా లలితకుమార్ ,ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా భవాని ,ట్రెజరర్ గా ఈశ్వరయ్య, ఈసీ నెంబర్ గా పైరోజ్ ,కర్ణ ,మూర్తి కుమార్ ,ఉదయ్ కుమార్ ,అనిల్, రాధ లు ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు. నంద్యాల గౌరాధ్యక్షు డోన్ సబ్ రిజిస్టర్ మహబూబ్ బాషా, నంద్యాల జిల్లా అధ్యక్షులుగా శివకుమార్, వైస్ ప్రెసిడెంట్గా ఆదినారాయణ ,సెక్రటరీగా అబ్దుల్ కరీం ,జాయింట్ సెక్రటరీగా మంజుల, ట్రెజరర్ గా అజిమియా, ఈసీ మెంబర్గా రాజు, మధు బాబు రాముడు, నీలమ్మ, వీరన్న, జయవాని ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్టాప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఎన్నికలు ఘనంగా నిర్వహించామని ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగాయని పారు తెలియజేశారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన చైర్ పర్సన్

కేసముద్రం, మార్చి 08(నంది పత్రిక):కేసముద్రం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డ్ బోడతండాలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న మహిళలని కలిసి శాలువాతో సత్కరించి మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవ సందర్భంగా తండాకు చెందిన బానోత్ అరుణ, బానోత్ తార లకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న మాట్లాడుతూ కేసముద్రం మున్సిపాలిటీ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం ప్రత్యేక పథకాలు, ఉచిత రవాణా, మహిళా కాంటీన్, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి అవకాశాలను కల్పిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. అనంతరం బోడతండా మహిళలు మున్సిపల్ చైర్ పర్సన్ ను శాలువాతో సత్కరించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



## జనసేన పార్టీ ఐదు లక్షల ప్రమాద బీమా మీ కుటుంబానికి భరోసా

## జిల్లా జనసేన పార్టీ పరిశీలకులు కిలారి వెంకట రోశయ్య

### జనసేన పార్టీ సభ్యత్వాలపై అవగాహన కార్యక్రమం

### జనసేన పార్టీ జనం పార్టీ ఇరిగేల రాంపుల్లారెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 8 నంది పత్రిక ఆళ్ళగడ్డ తాలూకా జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం నాడు జనసేన సభ్యత్వాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా పార్లమెంట్ జనసేన పార్టీ పరిశీలకులు పొన్నూరు మాజీ శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య పాల్గొని దిశానిర్దేశము చేశారు. ఈ సందర్భంగా జనసేన ఉద్యమి సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలు గురించి కార్యకర్తలకు వివరంగా ఆయన వివరించారు. పార్టీలో సభ్యత్వం వలన పార్టీ సభ్యునిగా గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు అలాగేపార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత పార్టీ కమిటీల్లో బాధ్యతలు అప్పగించేందుకు సభ్యత్వం తప్పనిసరి అన్నారు. సభ్యత్వం ఉన్న వారికి మాత్రమే నాయకత్వ బాధ్యతలు ఉంటాయన్నారు. నాయకత్వ ట్రైనింగ్, నాయకులుగా ఎదిగే అవకాశాలు ఉంటుందని అలాగే5 లక్షల ప్రమాద బీమా ద్వారా మీ కుటుంబానికి భరోసా ఉంటుందని జనసేన పార్టీ సభ్యత్వ నమోదు లో సాధకులు క్రియాశీలక పాత్ర పోషించాలని కిలారి వెంకట రోశయ్య తెలిపారు అనంతరం జనసేన సీనియర్ నాయకుడు ఇరిగెల రాంపుల్లా రెడ్డి , జనసేన పార్టీ గురించి సిద్ధాంతాల పార్టీ ముఖ్యాంశాల గురించి క్లుప్తంగా పార్టీ కార్యకర్తలకు వివరించారు ఈ కార్యక్రమంలో ఇరిగెల రామచంద్ర రెడ్డి ,ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి ఇరిగెల విశ్వనాథ్ , ఇరిగెల ప్రతాప్ రెడ్డి , ఇరిగెల భరత్ రెడ్డి , ఇరిగెల సుధాకర్ రెడ్డి , జున్ను ప్రసాద్ రెడ్డి , మండల నాయకులు, జనసైనికులు, సభ్యత్వ నమోదు వాలంటరీలు, పార్టీ శ్రేణులు తదితరులు భారీగా పాల్గొన్నారు. అంతకుముందు అక్కడ చేరుకున్న పార్టీ పరిశీలకులు కిలారి వెంకట రోశయ్యకు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.

## సమాజంలో స్త్రీ పాత్ర ముఖ్యమైనది ఎంపీడీవో నూర్జహాన్ బేగం

### ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ



ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 8 నంది పత్రిక అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గం స్థాయి లో ఆళ్లగడ్డ ఎంపీడీవో సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీఓ నూర్జహాన్ బేగం పాల్గొని మహిళల గురించి మాట్లాడుతు సమాజంలో స్త్రీ పాత్ర సమానత్వం, విద్య, వివాహల, ఉద్యోగంల వివరించారు. ఆళ్లగడ్డ ఏరియా కోఆర్డినేటర్ విజయ గోపాల్ మహిళ పాత్ర తదితర అంశాల గురించి వివరించారు అనంతరం ఎంపీడీవో నూర్జహాన్ బేగం మెప్మా సీఎం ఏం సుజాత తదితర వారిని శాలువలతో ఘనంగా సన్మానించారు ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం, దొర్నిపాడు, సిరివెళ్ల ఉ ఉయ్యాలవాడ మండలం ల ఏపీఎం లు, సీసీ లు, అకౌంటెంట్ లు, వి ఓ ఏ లు, వి ఓ ఓబీ లు, మెప్మా సి ఎం ఎం సుజాత మెప్మా సిబ్బంది ఉ పొదుపు మహిళ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గం స్థాయిలోని మహిళా సిబ్బందికి అన్ని మండలాల ఎంఎంఎస్ అధ్యక్షులను శాలువతో సన్మానించడం జరిగింది.

## పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి: సిపిఎం డిమాండ్



కేసముద్రం, మార్చి 08(నంది పత్రిక):సిపిఎం కేసముద్రం మండల కమిటీ ఆధ్వర్యంలో పెంచినగ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కేసముద్రం మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే సెంటర్లో కట్టెలపోయి పైవంట కార్యక్రమం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మార్తినేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరల బారం మోపి మహిళలపై గృహ వినియోగదారులకు సిలిండర్ పై 60 రూపాయలు, వాణిజ్య వినియోగదారులకు 115 రూపాయలు పెంచారని, తక్షణమే పెంచినగ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడల దశలవారి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు చాగంటి కిషన్, కావటి నర్సయ్య, నీరుటి జలంధర్, జల్లే జయరాజ్, సోమారపు ఎల్లయ్య, అల్లుగొండ సావిత్ర, తోట యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై హింసను నివారించాలి.

### ఐద్వ మండల కార్యదర్శి అల్లుగొండ సావిత్ర.




కేసముద్రం, మార్చి 08(నంది పత్రిక):కేసముద్రం మండలం హరిహర గార్డెన్స్ లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వ మండల కార్యదర్శి అల్లుగొండ సావిత్ర మాట్లాడుతూ రోజురోజుకు మహిళలు గృహహింసకు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురవుతున్నారని, హత్యలు అత్యాచారాలు, దాడులకు గురవుతున్నట్లు జాతీయ నేర నిర్ధారణ గణాంకాలు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కొరకు ఉన్న చట్టాలను అమలు చేయాలని, మద్యం, మత్తు పదార్థాలు నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో తోట యాకమ్మ, నూకల కవిత, వాంకుడోత్ యమున, గుగులోతు మాలమ్మ, వాంకుడోత్ రమ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ సేవా సదన్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు"




కర్నూలు నంది పత్రిక...... జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు అధ్యక్షులు జి. కబర్థి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూల్ నగరంలోని స్థానిక జిల్లా కోర్ట్ ఆవరణలో గల న్యాయ సేవా సదన్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి. కమలాదేవి , ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మి రాజ్యం ,సి బి ఐ కోర్ట్ జడ్జి శోభారాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ , మొబైల్ కోర్ట్ జడ్జి అనూష పాల్గొన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మొదటి అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ మహిళా దినోత్సవం విశిష్టత, మహిళల యొక్క ప్రాముఖ్యతను వివరించారు, అలాగే మహిళలు నేటి సమాజంలో జరుగుతున్న అరాచకాలు దృష్టిలో ఉంచుకొని ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని, అలాగే మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తే దేశం ఎంతగానో పురోగతి సాధిస్తుందని అన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి సూచనల మేరకు వందరోజుల బాల్య వివాహ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మరియు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారి సంయుక్త సహకారంతో జిల్లాలోని 160 గ్రామాలలో సదస్సు లు నిర్వహించి బాల్య వివాహల వల్ల జరిగే అనర్థాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బి.అగ్రహారం, సంతె కుడ్లూరు, లింగంపల్లి గ్రామాలలో జరుగుతున్న బాల్య వివాహాలను సకాలంలో ఆపి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం మహిళా న్యాయ మూర్తు లైన కమలాదేవి ,లక్ష్మి రాజ్యం, శోభారాణి,సరోజనమ్మ, అనూష లను లీగల్ సర్వీసెస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయ వాదులు నిర్మల, యూ వి లక్ష్మి, ఇందుమతి మరియు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన, బచ్పన్ బచావో ఆందోళన్ ఎన్జీవో మౌనిక, ఎన్జీవో డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు ,మహిళా ప్యానెల్ నాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు అన్ని కోర్టు ల మహిళ సిబ్బంది, ప్యారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## లోన్ యాప్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ...

### గుర్తు తెలియని లేదా అనుమానాస్పద లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు.

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



కర్నూలు నంది పత్రిక... ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్‌ల ద్వారా అందుబాటులో ఉన్న వివిధ లోన్ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది మోసగాళ్లు సోషల్ మీడియాలో , మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ ద్వారా తక్కువ సమయంలో సులభంగా లోన్ ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు . ఈ లోన్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసిన తర్వాత మొబైల్‌లో ఉన్న కాంటాక్ట్‌లు, ఫోటోలు, వ్యక్తిగత సమాచారం వంటి వివరాలను యాక్సెస్ చేసి, తరువాత ఎక్కువ వడ్డీ వసూలు చేయడం లేదా బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కర్నూలు ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు ఈ క్రింది సూచనలు చేశారు. గుర్తు తెలియని లేదా అనుమానాస్పద లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు.లోన్ అవసరం ఉన్నప్పుడు అధికారిక బ్యాంకులు లేదా గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థలను మాత్రమే సంప్రదించాలి.తెలియని లింకులు, మెసేజ్‌ల ద్వారా వచ్చిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేయరాదు.ఎవరైనా లోన్ యాప్ పేరుతో బెదిరింపులకు పాల్పడితే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.లోన్ యాప్ మోసాలకు గురైన వారు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయడం లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.లేదా కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నందవరం చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి ఉత్సవాలపై మంత్రి సమీక్ష



బనగానపల్లె మార్చి 8 నంది పత్రిక నందవరం చౌడేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానం నందు 19 నుండి 25 వ తేదీ వరకు జరగబోయే ఉగాది రాయబారది జ్యోతి మహోత్సవాల నిర్వహణపై ఆదివారము రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆలయ అధికారులు పాలకమండలి సభ్యులు, అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అత్యంత వైభవంగా జరిగేటువంటి ఈ ఉత్సవాలలో కర్ణాటక, మహారాష్ట్ర మరియు రెండు తెలుగు రాష్ట్రాలు నుండి లక్షలమంది భక్తులు వస్తారు.కనుక భక్తులకు ఎటువంటి ఇబ్బందులు అసౌకర్యాలకు గురి కాకుండా సకల వసతులు కల్పించాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వాణాదికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా చలవ పందిరులు మరియు త్రాగునీరు, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని భక్తుల కొరకు సాంస్కృతిక కార్యక్రమాలు మరియు రైతు సంబరాలు, కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ పివి. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కొరకు వచ్చు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆలయ ఉగాది ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు.

## శ్రీ మద్దిలేటి స్వామి క్షేత్రంలో స్వాతి నక్షత్ర వేడుకలు

బేతంచెర్ల మార్చి 8 (నంది పత్రిక) బేతంచెర్ల మండలం ఆర్ ఎస్. రంగాపురం గ్రామ పరిధిలో వెలసి ఉన్నప్రముఖ వైష్ణవ క్షేత్రం, లక్షలాది భక్తుల ఆరాధ్య దైవం శ్రీ మద్దులేటి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు ఉప కమీషనర్ ఉదేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు, వేద పండితులు,ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుంచి సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు.అనంతరం మంగళ వాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల ను ఆలయ అధికారులు,సిబ్బంది భక్త జన సందోహంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోశ్రీ మద్దులేటీ స్వామి ఆలయ మాజీ చైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# నరేటి శ్రీకాంత్ మరణం కుటుంబానికి తీరని లోటు.





**నివాళులర్పించి, బియ్యం, ఆర్థిక సహాయం అందించిన సమ్మిగౌడ్.**

**కన్న కొడుకులా సమ్మిగౌడ్ ఫౌండేషన్ అండ**

**కేసముద్రం, మార్చి 08(నంది పత్రిక)**:కేసముద్రం మండల కేంద్రంలోని తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన నరేటి యాదగిరి-ఎల్లమ్మ దంపతుల కుమారుడు నరేటి శ్రీకాంత్ గౌడ్ మరణం స్థానికంగా పెను విషాదాన్ని నింపింది. శ్రీకాంత్ గౌడ్ మరణ వార్త తెలిసిన వెంటనే సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీకాంత్ చిత్రపటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా ఒక క్వింటా బియ్యం, రూ.3వేల నగదును అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ చిన్న వయసులోనే శ్రీకాంత్ మనల్ని విడిచి వెళ్లడం అత్యంత బాధాకరం. కష్టపడి పైకి వస్తున్న యువకుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం ఆ కుటుంబానికి కోలుకోలేని లోటు, భౌతికంగా తమ కొడుకు లేని లోటు తీర్చలేకపోయిన ఒక కొడుకులా సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎల్లవేళలా ఈ కుటుంబానికి రక్షణగా, అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సొసైటీ అధ్యక్షులు నరేటి సత్తయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు నరేటి కొమురయ్య గౌడ్, నరేటి నారాయణ, మాజీ సర్పంచ్ కందుకూరి దాస్, వేముల యాదగిరి, వల్లాల వెంకన్న, ముత్తిలింగం, కొమురయ్య, నరేటి ముత్తయ్య, వేముల కొమురయ్య, వల్లాల కాశీనాథ్, నరేటి విజయ్, నరేటి



సంతోష్, వంగ సాగర్, వంగ సురేందర్, వల్లాల ప్రశాంత్, మెంచు వంశీ, వల్లాల రాజేందర్, నరేటి నరేష్, నరేటి వేణు, సాయి, కోమిరే ప్రశాంత్, మందుల మహేష్, మంద శ్రీకాంత్, గుర్రాల అశోక్, తీగల సునీత, మెంచు పద్మ, వంగ యశోద, వల్లాల యశోద, వేముల సుశీల, వల్లాల సుభద్ర, అరుణ, వల్లాల అనిత, వేముల రాధిక, గుండ్ల ఉమా, వల్లాల మౌనిక, సౌజన్య సహా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని శ్రీకాంత్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## శ్రీవివేకవర్ధని హైస్కూల్ లో అంతర్ముఖ, ఆనంద, ఆరోగ్య, యోగ శిబిరం



**కేసముద్రం, మార్చి 08(నంది పత్రిక)**:కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం అంతర్ముఖ ఆనంద ఆరోగ్య యోగ శిబిరం ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన శ్రీసత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ యోగా గురువు భిక్షమయ్య పాల్గొని యోగ సాధన యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళనలు తగ్గి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందని చెప్పారు. యోగ మనిషిని అంతర్ముఖంగా మార్చి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. శ్రీవివేకవర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత యోగ సాధనను అలవాటు చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. ఈ శిబిరాన్ని నిర్వహించడంలో సహకరించిన నిర్వాహకులు చింతనూరి సతీష్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు, యోగా ఆసక్తి గల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

# మహిళా ఆరోగ్యమే కుటుంబ జీవనాధారం







**భారతీయ సంస్కృతిలో స్త్రీలను దేవతామూర్తులుగా స్థానం కల్పించి గౌరవించారు.**

**నేడు మహిళలు అన్ని రంగాలలో విశేషమైన ప్రతిభతో ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారు.**

**మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం, దేశం సుభిక్షంగా ఉంటుంది.**

**రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు.**

**భీమవరం బ్యూరో చీఫ్ మార్చి 8 నంది పత్రిక**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం నందు ఆదివారం జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణంరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, పిఎసి చైర్మన్ భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు విజయ భారతి సైనీ, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత, ఏఎంసి చైర్మన్ కలిదిండి సుజాత, ఏపీ కృష్ణ బలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ బూసి వినీత, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ పాశ్చాత్య దేశాలైన అమెరికా, డెన్మార్క్ లలో మహిళా దినోత్సవం కేవలం ఆ దేశ జాతీయ దినోత్సవంగానే జరుపుకునే వారిని, 1977 లో ఐక్యరాజ్యసమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించిందన్నారు. ఏ కార్యక్రమం చేపట్టి దిగ్విజయం చేయాలన్న పురుషుల కన్నా స్త్రీలు మానసికంగా దృఢత్వం గా ఉంటారన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్త్రీలకు సమాన ఆస్తి హక్కు కల్పించారన్నారు. నేడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ పథకం ప్రారంభించిన మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్నారు అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వారా మహిళలు నేడు ఆర్థికంగా ఎదుగుతున్నరన్నారు. మహిళలు సంతతిపై ఆడ, మగ బేధభావం లేకుండా ఉండాలన్నారు. నేటి పరిస్థితులలో ఆడపిల్లలకి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆడపిల్ల అంటే భారం అనే భావన విడనాడాలన్నారు. నేడు సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందు ఉంటున్నారన్నారు. సమాజంలో మహిళలు సంతోషంగా ఉంటే కుటుంబం, సమాజం, దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. కుటుంబం అభివృద్ధి మహిళల నిర్వహణ పైన ఆధారపడి ఉంటుంది అన్నారు. నేడు చట్టసభల్లో కూడా మహిళలు తమదైన వాణిని వినిపిస్తున్నారన్నారు. సమాజంలో మహిళలకు సముచితమైన గౌరవం కల్పించవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన అన్నారు.

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ** ఒక దేశం నిజమైన పురోగతిని సాధించాలంటే ఆ దేశంలోని మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా స్వతంత్రులుగా ఉండాలన్నారు. ఈ లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ పథకాల ద్వారా మహిళల జీవితాల్లో స్పష్టమైన సానుకూల మార్పులు కనిపిస్తున్నాయని తెలిపారు. 1,626 అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు పౌష్టికాహారం అందుతోందన్నారు. పి ఎం ఎం వి వై పథకం ద్వారా 3,692 మంది తల్లులకు సుమారు రూ.1.06 కోట్లు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. మహిళల రక్షణ కోసం వన్ స్టాప్ సెంటర్, 181, 1098 హెల్ప్‌లైన్లు 24 గంటలు సేవలందిస్తున్నాయని తెలిపారు. ప్రతి నెలా 1.30 లక్షల మహిళలకు సుమారు రూ.53.76 కోట్లు పెన్షన్లుగా అందించడం జరుగుతుంది అన్నారు. స్వయం సహాయక సంఘాలకు 2025-26లో రూ.805.89 కోట్లు బ్యాంకు రుణాలు మంజూరు చేయగా, రికవరీ రేటు 99.98% ఉండటం మహిళల క్రమశిక్షణకు నిదర్శనం అన్నారు. స్త్రీ నిధి, ఉన్నతి పథకాల ద్వారా కూడా మహిళలకు ఆర్థిక సహాయం అందుతోందనీ తెలిపారు. జిల్లాలో మహిళలు సేంద్రీయ ఎరువుల తయారీ, చాక్లెట్ తయారీ వంటి వినూత్న వ్యాపారాలు స్థాపించడం జరిగింది అన్నారు.. డిజిటల్ లక్ష్మి ద్వారా వేలాది ఉత్పత్తులు ఆన్‌లైన్‌లో విక్రయించడం ద్వారా, కొంతమంది మహిళలు నెలకు రూ.65 వేలు నుండి రూ.80 వేలు వరకు సంపాదిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో అమ్మాయిలు 85.56% తో అబ్బాయిలకంటే మెరుగైన ఫలితాలు సాధించారని వెల్లడించారు. "శక్తి టీమ్స్" మహిళల భద్రత కోసం 24 గంటలు పనిచేస్తున్నాయి. విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ కూడా అందించడం జరుగుచున్నదని తెలిపారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా కోట్లాది మహిళలు ప్రయాణిస్తున్నారన్నారు. ఉజ్వల యోజన ద్వారా వేలాది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించడంతోపాటు, . పి శ్రీఎంఏవై ద్వారా వేలాది ఇళ్లు మహిళల పేరుపై నిర్మించబడుతున్నాయన్నారు. మహిళలకు అవకాశం ఇస్తే వారు కుటుంబానికే కాకుండా సమాజం, దేశ అభివృద్ధికి పెద్ద పాత్ర పోషిస్తారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకొని మహిళలు మరింత ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. భీమవరం శాసనసభ్యులు మరియు ఏపీసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ స్త్రీ లేనిదే సృష్టి లేదన్నారు. స్త్రీ అంటే ఇంటికి ఇలవేల్పు మహాలక్ష్మి అని ఆ స్త్రీని గౌరవించవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏ దేశంలో అయితే మహిళలు గౌరవించబడతారో ఆ దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఒకప్పుడు వంటింటికి పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారన్నారు. నేడు ప్రభుత్వాలు అన్ని రంగాలలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. చట్టసభలలో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు విజయ భారతి సైనీ, ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత స్త్రీల హక్కులు, ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు, సమాజంలో వారి ప్రస్తుత గమనం తదితర విషయాలపై ప్రసంగించారు. చివరిగా మహిళా దినోత్సవ సందర్భంగా ముద్ర, పిఎంఈజీపి, పీఎం ఎఫ్ఎంఈ, విశ్వకర్మ పథకాల కింద 62, 833 మంది లబ్ధిదారులకు రూ.823.40 కోట్లు బ్యాంకు రుణాలు, 9,171 ఎస్ హెచ్ జి సంఘాలకు రూ.1,098,75,00,000/- ఒక వెయ్యి 98 కోట్ల 75 లక్షల బ్యాంకు లింకేజీ రుణాలు, 156 నంది ఎస్సీ ఎస్ హెచ్ జి లబ్ధిదారులకు కార్పొరేషన్ సబ్సిడీతో కూడిన ఉన్నతి, వడ్డీ లేని రుణాలు రూ.2,08,50,000/- లు, 6,619 ఎస్ హెచ్ జి సభ్యులకు స్త్రీ నిధి, ఉన్నతి, సిఐఎఫ్ రుణాలుగా రూ.2,35,28,00,000/- లు నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగింది.అలాగే పెంటపాడు మండలం ఎఫ్పిఓ కు డి ఆర్ డి ఏ, సెర్ఫ్ ద్వారా రూ.8 లక్షలు విలువైన ట్రాక్టర్ ను కష్టం హైరింగ్ సెంటర్ కు అందజేయడం జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సెర్ఫ్, మెప్మా సంస్థల ఆర్థిక ప్రోత్సాహంతో వివిధ వ్యాపారాలు, యూనిట్ల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధించిన పారిశ్రామిక వేత్తలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మెమొంటోలతో సత్కరించి అభినందించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలలో విశేష ప్రతిభ కనబరిచిన ఉద్యోగినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు ముందుగా భీమవరానికి చెందిన సెంట్ మేరీస్, ఆదిత్య స్కూలు, విష్ణు కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డి ఆర్ ఒ బి.శివన్నారాయణ రెడ్డి, ఐసిడిఎస్ పిడి డి లక్ష్మి, డి ఆర్ డి ఎ పిడి ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, సిపిఓ కే శివ పార్వతి, డీఎస్ఓ ఎన్.సరోజ పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, డీఈవో ఇ.నారాయణ, జిల్లా చేనేత,జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ హెప్సిబా, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు, పాఠశాలల కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.











## మహిళలు ఆరోగ్య పరంగా, మానసికంగా దృఢంగా ఉంటూ ఆదర్శ ప్రాయమైన జీవనం కొనసాగించాలి.

**మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలి.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**





**భీమవరం బ్యూరో చీఫ్ మార్చి 8 నంది పత్రిక** స్థానిక ప్రకాశం చౌక్ నుండి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన 2కె రన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని రన్‌ను ప్రోత్సహించారు. మహిళలు మరియు యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని 2 కె రన్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య పరంగా, మానసికంగా దృఢంగా ఉండి ఆదర్శప్రాయమైన జీవనం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు కుటుంబానికి వెన్నుముకలా ఉంటారని, వారు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా మరియు సమాజం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. శారీరక దృఢత్వం మంచి ఆరోగ్యానికి పునాది అని పేర్కొంటూ ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని మహిళలకు సూచించారు. మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ విశేష ప్రతిభ కనబరుస్తున్నారని కలెక్టర్ అభినందించారు. తమ హక్కుల సాధనతో పాటు సమాజపట్ల ఉన్న బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తిస్తూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ సతీమణి వెంకటేశ్వరి దేవి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సతీమణి లక్ష్మీ శృతి, ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత, డి.ఎస్.పి రఘువీర్ విష్ణు, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏవి సూరిబాబు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కీర్తి కిరణ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్యులు, వారి కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

